

రైల్వే జోన్ భవన నిర్మాణ పనులు ప్రారంభం


- కేటాయించిన భూమిలో మట్టి పరీక్షలు నిర్వహణ

... మెయిన్‌లో


రైల్వేకు కేటాయించిన భూమిని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ఏయూ వీసీగా రాజశేఖర్

ఐఐటీ ప్రొఫెసర్‌ను నియమించిన ప్రభుత్వం


ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్



- స్వస్థలం కె.కోటపాడు మండలం ఏ.కొడూరు
- తండ్రి ఉద్యోగ రీత్యా సింహాచలంలో స్థిరపడిన కుటుంబం
- నగరంలోనే విద్యాభ్యాసం
- ఏవీఎన్ కళాశాలలో ఇంటర్, డిగ్రీ
- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పోస్టు గ్రాడ్యుయేషన్, ఎంఫిల్, పీహెచ్‌డీ
- బోధనలో 27 ఏళ్ల అనుభవం
- 2002లో యంగ్ సైంటిస్ట్ అవార్డు
- విద్యావేత్తల హర్షం

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతిగా ఖరగ్‌పూర్ ఐఐటీలో గణిత శాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తున్న ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ నియమితులయ్యారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదేశాల మేరకు ఉన్నత విద్యా శాఖ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఏయూ వీసీగా ప్రొఫెసర్ రాజశేఖర్ మూడేళ్లపాటు కొనసాగనున్నారు.

వీసీ పోస్టు కోసం వర్సిటీకి చెందిన సుమారు పది మంది సీనియర్ ప్రొఫెసర్లు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు సాగించారు. అయితే, ఐఐటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రాజశేఖర్ వైపు ప్రభుత్వం మొగ్గు చూపింది. అందుకు అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుంది. దేశంలోనే పురాతన విశ్వవిద్యాలయాల్లో ఒకటైన ఏయూ మరో ఏడాదిలో శతాబ్ది ఉత్సవాలకు సిద్ధమవు తోంది. అంతటి చరిత్ర కలిగిన విశ్వవిద్యాలయం దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల జాబితాలో చోటుదక్కించుకోవాలనేది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్‌ల లక్ష్యం. అందుకు అను గుణంగా నిర్ణయాలు తీసుకుని, అమలు చేయడానికి బయట ప్రొఫెసర్ అయితే బాగుంటుందన్న ఉద్దేశంతోనే ... మిగతా 6వ పేజీలో

ఇదీ నేపథ్యం..

నూతన వీసీగా నియమితులైన ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ స్వస్థలం అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఏ.కొడూరు. అయితే కుటుంబం తండ్రి ఉద్యోగ రీత్యా సింహాచలంలో స్థిరపడింది. రాజశేఖర్ ఒకటి నుంచి ఏడో తరగతి వరకు సింహాచలంలోని మండల పరిషత్ ప్రాథమి కోన్నత పాఠశాలలో, ఏడు నుంచి పదో తరగతి వరకూ సెయింట్ ఆంథోనీ స్కూల్‌లో, ఇంటర్, డిగ్రీ (మ్యాథమేటిక్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ సబ్జెక్టులతో) ఏవీఎన్ కాలేజీలో చదువుకున్నారు. అనంతరం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎమ్మెస్సీ (అప్లైడ్ మ్యాథమెటిక్స్), ఎంఫిల్ చేసిన ఆయన... 1997లో అక్కడే పీహెచ్‌డీ పూర్తిచేశారు. ప్రొఫెసర్ రాజశేఖర్‌కు 27 ఏళ్ల బోధన, పరిశోధన అనుభవం ఉంది. ఇప్పటివరకూ ఆయన వద్ద 14 మంది డాక్టరేట్ డిగ్రీలు అందుకున్నారు. మరో నలుగురు పీహెచ్‌డీ పూర్తిచేస్తున్నారు. ఇప్పటి వరకూ ఆరు పరిశోధన ప్రాజెక్టులు పూర్తిచేశారు. 112 రీసెర్చ్ పబ్లికేషన్స్ వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. 2002లో యంగ్ సైంటిస్ట్ అవార్డ్ ఇన్ మ్యాథమెటికల్ సైన్సెస్‌ను ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ అందించింది. ఈ అవార్డును అప్పటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చేతుల మీదుగా అందుకున్నారు. వీటితో పాటు అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి అవార్డులను, గోల్డ్ మెడల్స్‌ను రాజశేఖర్ అందుకున్నారు.

ఏయూ నుంచి ఇద్దరికీ వీసీలుగా అవకాశం

- నన్నయ వర్సిటీకి ప్రొఫెసర్ ప్రసన్నశ్రీ
- కృష్ణా వర్సిటీకి ప్రొఫెసర్ రాంజీ

ఏయూకు చెందిన ఇద్దరు సీనియర్ ప్రొఫెసర్లు రాష్ట్రంలోని మరో రెండు వర్సిటీలకు వీసీలుగా నియమితులయ్యారు. ఇంగ్లీష్ విభాగానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ ప్రసన్నశ్రీ రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి వీసీగా నియమితులయ్యారు. ఆమె స్వస్థలం విజయవాడ కాగా, గడిచిన 25 ఏళ్ల నుంచి ఏయూలోనే పనిచేస్తున్నారు. ఆమె గిరిజనుల లిపికి సంబంధించి పరిశోధనలు సాగించారు. అలాగే, ఏయూకు చెందిన మరో ప్రొఫెసర్ కె.రాంజీ మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీ వీసీగా నియమితులయ్యారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన రాంజీ గతంలో ఆ జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి వైస్ చాన్సలర్‌గా సేవలు అందించారు. తాజాగా మరోసారి వీసీగా నియమితులయ్యారు.


ప్రొఫెసర్ ప్రసన్న శ్రీ


ప్రొఫెసర్ రాంజీ

నోవాటెల్ డౌన్‌లో అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొని చిల్డ్రన్ పార్కులోకి దూసుకువెళ్లిన లారీ



డేంజర్ జోన్

నోవాటెల్ డౌన్‌లో తరచూ అదుపుతప్పుతున్న వాహనాలు

- రక్షణ గోడను ఢీకొంటున్న వైనం
- తాజాగా ఇసుక లారీ బీభత్సం
- ఒకరికి గాయాలు
- అక్కడ ఇప్పటివరకూ ఏడు ప్రమాదాలు
- ఇద్దరి మృతి, పదుల సంఖ్యలో క్షతగాత్రులు
- ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు శాశ్వత చర్యలు అవసరం
- నిపుణులతో అధ్యయనం చేయిస్తామన్న పోలీస్ కమిషనర్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

బీచ్‌రోడ్డులో వాకింగ్ చేయడం, సాయంత్రం వేళ సమయం దొరికితే అక్కడి రక్షణ గోడపై కూర్చుని చల్లని వాతావరణాన్ని ఆస్వాదించడం నగరవాసులకు చాలా ఇష్టం. కానీ నోవాటెల్ హోటల్ డౌన్ ఎదురుగా ఉన్న ప్రాంతం అంటే మాత్రం బీచ్‌కు వెళ్లేవారికి వణుకు పుడుతోంది. పందిమెట్ట వైపు నుంచి వచ్చే వాహనాలు తరచూ అదుపుతప్పి బీచ్‌రోడ్డులోని పారాపిట్‌వాల్ (రక్షణగోడ)ను ఢీకొంటున్నాయి. గత పదేళ్లలో అక్కడ ఏడు ప్రమాదాలు జరిగాయి. ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, పది మందికి పైగా గాయపడ్డారు. మంగళవారం ఉదయం ఇసుక లారీ అదేచోట అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొని,దానిని ఆనుకుని ఉన్న ... మిగతా 6వ పేజీలో

గత పదేళ్లలో ఏడు ప్రమాదాలు

బీచ్‌రోడ్డులో నోవాటెల్ డౌన్‌లో గత పదేళ్లలో ఏడు ప్రమాదాలు జరిగినట్టు పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. 2014లో ఆటో అదుపు తప్పి రక్షణగోడను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది గాయపడ్డారు. 2017 ఏప్రిల్ 30వ తేదీ సాయంత్రం ఐదు గంటల సమయంలో గేట్‌వే హోటల్ వద్ద విద్యార్థులను దింపి బీచ్‌రోడ్డులోకి వస్తున్న ఒక ప్రైవేటు స్కూల్ బస్సు అదుపు తప్పడంతో ఎదురుగా ఉన్న రక్షణ గోడను ఢీకొట్టింది. ఆ సమయంలో రక్షణ గోడపై అదనపు ఎస్పీ స్థాయి అధికారి కుటుంబీకులు కూర్చుని ఉన్నారు. ప్రమాదంలో అదనపు ఎస్పీ తండ్రి అక్కడికక్కడే, పదేళ్ల కుమారుడు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. అదనపు ఎస్పీ సహా మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. 2020 ఫిబ్రవరి ఒకటో తేదీ ఉదయం ఐదు గంటల సమయంలో కేబుల్ వైర్లు, జేసీబీ లోడుతో నోవాటెల్ డౌన్ దిగుతున్న లారీ అదుపు తప్పి నేరుగా బీచ్‌రోడ్డులోకి దూసుకెళ్లి ఎదురుగా ఉన్న రక్షణగోడను ఢీకొట్టింది. ఇలాంటి ప్రమాదాలు గత పదేళ్లలో మరికొన్ని జరిగినట్టు పోలీసులు చెబుతున్నారు. ఒకేచోట తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున... వాటికి అడ్డుకట్ట వేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నిపుణులతో అధ్యయనం చేయిస్తామని, తగిన జాగ్రత్తలు తీసుకుంటామని సీపీ శంఖబ్రతబాగ్చి పేర్కొన్నారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సేవలు అందేదెన్నడో?

- 14 నెలల కిందట పూర్తయిన భవన నిర్మాణం
- ఆస్పత్రికి చేరిన పరికరాలు
- ప్రారంభానికి కుదరని ముహూర్తం
- అందుబాటులోకి వస్తే రోగులకు మెరుగైన వైద్యం
- కొత్తగా 80 పడకలు
- సైకియాట్రిక్ నర్సింగ్, క్లినికల్ సైకాలజీ, సైకియాట్రిక్ సోషల్ వర్క్ కోర్సులు నిర్వహణ

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భవనం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ మానసిక వైద్యశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పేరుతో అప్‌గ్రేడ్ చేశాయి. ఇందుకోసం 60:40 నిష్పత్తిలో నిధులు వెచ్చించాయి. నగర పరిధిలోని మానసిక వైద్యశాలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కింద అప్‌గ్రేడ్ చేసేందుకు సుమారు ఏడేళ్ల కిందట కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.29.6 కోట్లు వెచ్చించి ఆస్పత్రి ప్రాంగణంలోనే సువిశాలమైన భవనం నిర్మించాయి. ఈ పనులు పూర్తయి దాదాపు 14 నెలలు దాటింది. అయితే, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సేవలు ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. భవనాలు సిద్ధమయ్యాయని, ఖరీదైన పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది. అయితే, అనూహ్యంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మరోసారి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భవన ప్రారంభం వాయిదా పడింది.

మెరుగైన వైద్య సేవలు

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అందుబాటులోకి వస్తే మానసిక సమస్యలతో బాధపడే రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు ... మిగతా 6వ పేజీలో

‘కమర్షియల్’ అధికారులకు ఇంక్రిమెంట్ల కోత

కుంభకోణం బయటపడిన రెండేళ్ల తరువాత చర్యలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం జీఎస్‌టీ (వాణిజ్య పన్నుల శాఖ) కార్యాలయంలో రెండేళ్ల క్రితం జరిగిన విచారణపై ప్రభుత్వం ఇప్పుడు చర్యలు చేపట్టింది. నాలుగేళ్ల క్రితం అప్పటి మంత్రి ధర్మానకు చెందిన బంధువు ఒకాయన ఇక్కడ అధికారిగా పనిచేశారు. ఆ సమయంలో సర్కిళ్ల వారీగా అధికారులను నియమించుకుని అక్రమాలకు తెగబడ్డారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై అప్పట్లో ‘ఆంధ్రజ్యోతి’ వరుస కథనాలు ప్రచురించింది. ప్రభుత్వం విచారణకు అమరావతి నుంచి అధికారులను పంపింది. వారు రికార్డులన్నీ స్వాధీనం చేసుకున్నారు. ఓ న్యాయవాది ఇక్కడి అధికారుల వేధింపులపై నేరుగా ఫిర్యాదు చేశారు. వాటిపైనా విచారణ జరిగింది. ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించారు. ఐదుగురు అధికారులపై చర్యలకు సిఫారసు చేశారు. ఆ తరువాత వారిలో ఇద్దరు జె.ధర్మపాల్, టి.సోమేశ్వరరావులు తమ తప్పు ఏమీ లేదని చెప్పుకోవడంతో వారిపై చర్యలు ఉపసంహరించారు. జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.సుధాకర్‌రావు కింది స్థాయి ఉద్యోగులను అక్రమాలకు ప్రోత్సహించారని, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించారని, పరిధి దాటి నిర్ణయాలు తీసుకున్నారని తేలడంతో ఆయనకు నాలుగు వార్షిక ఇంక్రిమెంట్లు కోత విధించారు. అలాగే డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన పి.జయశంకర్‌పై వచ్చిన ఆరోపణలు వాస్తవమని తేలింది.ఉన్నతాధికారులు పర్యటనకు వస్తున్నారని అన్ని సర్కిళ్లలో తరచూ డబ్బులు వసూలు చేశారని నిర్ధారణ అయింది. మిగిలిన అభియోగాలు కూడా వాస్తవమని తేలడంతో ఆయనకు కూడా నాలుగు వార్షిక ఇంక్రిమెంట్లు కోత పెట్టారు. జీఎస్‌టీఓగా అనకాపల్లిలో పనిచేయాల్సిన ప్రశాంత్‌కుమార్ విశాఖపట్నం వచ్చి విధులు నిర్వహించేవారు. అక్రమ వసూళ్లకు ఉన్నతాధికారులకు సహకరించేవారనే ఆరోపణలు నిజమని తేలడంతో నాలుగు వార్షిక ఇంక్రిమెంట్లు నిలిపివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

గ్రావెల్ మాఫియా

- కూటమి నేతల కనుసన్నల్లోనే వ్యవహారం
- ఎస్.కోట, ఏజెన్సీ ప్రాంతంలో ఇసుక, పెందుర్తి మండలంలో మట్టి తవ్వకాలు
- ఎవరూ అడ్డుకోకుండా ‘గ్రీన్ ఛానల్’ ఏర్పాటు
- అడ్డగోలు సంపాదన కోసమే వైసీపీ నుంచి పలువురు జనసేనలో చేరిక



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పెందుర్తి నియోజకవర్గంలో కూటమి నేతల కనుసన్నల్లో ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. ఇసుకను ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి అధికారిక ముద్రతో అమ్ముకుంటున్నారు. వీరి వాహనాలను ఎవరూ అడ్డగించకుండా ఉండేందుకు కొందరు అధికారులు ఏకంగా ‘గ్రీన్ ఛానల్’ ఏర్పాటుచేయడం గమనార్హం.

ఏ ప్రభుత్వం వచ్చినా నగర శివారు నియోజకవర్గ నాయకులు ఇసుక, మట్టి తవ్వకాలపైనే దృష్టి పెడుతున్నారు. ఇప్పుడు పెందుర్తిలోను అదే జరుగుతోంది. రాంబిల్లిలో తూర్పు నౌకాదళం నిర్మిస్తున్న ప్రత్యామ్నాయ స్థావరానికి, భోగాపురంలో నిర్మితమవుతున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి మట్టి, ఇసుక పెద్దఎత్తున అవసరం కావడంతో వాటిని సరఫరా చేయడానికి రాజకీయ నాయకులు పోటీ పడుతున్నారు. పెందుర్తి నేతలు అరకు, ఎస్.కోట తదితర ప్రాంతాలలో ఇసుకను తవ్వించి లారీల్లో తెప్పిస్తున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అమ్ముకుంటున్నారు. ఈ లారీలు గమ్యస్థానాలకు వెళ్లేటపుడు మధ్యలో ఎవరూ అడ్డగించకుండా ఉండేందుకు అధికారులతోనే ప్రత్యేకంగా ‘గ్రీన్ ఛానల్’ ఏర్పాటు చేయించుకున్నారు. ఆ లారీలు ఎక్కడ ఎదురైనా స్థానిక అధికారులు ఎవరూ అడ్డగించకూడదని అనధికార ఆదేశాలు కూడా జారీఅయ్యాయి. అదే విధంగా కొండలను, ప్రభుత్వ భూములను తవ్వి ఎర్రమట్టిని తరలించుకుపోతున్నారు. ఇటీవల నియోజకవర్గంలో కొందరు వైసీపీ నాయకులు జనసేన పార్టీలో చేరారు. వారు గతంలో మట్టి, ఇసుక అమ్మకాల ద్వారా బాగా లాభపడ్డారు. ఇప్పుడు అవే వ్యాపారాలను నడుపుతున్నారు. వీరికి పోటీగా ఇంకెవరైనా ఇసుక తెచ్చినా, మట్టి తవ్వినా, తరలించినా ఆ వాహనాలను పట్టుకొని కేసులు పెట్టిస్తున్నారు. పోలీస్ స్టేషన్లలో పంచాయితీలు నడుపుతున్నారు. ఇటువంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాల్సిన అధికారులు సైతం నాయకులకు సహకరించడం విశేషం.

ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):



నిర్మాణ పనుల కారణంగా రద్దు చేసిన ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519/18520) రైళ్లను పునరుద్ధరించినట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 20న విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519), తిరుగు ప్రయాణంలో ఎల్‌టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18520) ఈ నెల 21న షెడ్యూల్ ప్రకారం యథావిధిగా రాకపోకలు సాగిస్తాయన్నారు.

చర్లపల్లి-శ్రీకాకుళం మధ్య ప్రత్యేక రైలు

ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్డు మధ్య ఒక ట్రిప్పు (రానుపోను) ప్రత్యేక రైలు నడుపుతున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ ... మిగతా 6వ పేజీలో

66 చోరీ కేసుల్లో 74 మంది అరెస్టు

రూ.92 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి
- క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులపై నిఘా
- బైక్ రేసింగ్‌లకు అడ్డుకట్ట వేస్తాం


క్రైమ్ మేళాలో రికవరీ చేసిన చోరీ సొత్తును పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):

గత నెలలో 106 చోరీ కేసులు నమోదైతే...వాటిలో 66 కేసులను ఛేదించినట్టు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన క్రైమ్‌మేళా సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ 66 చోరీ కేసుల్లో 74 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.92 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఛేదించిన వాటిల్లో మూడు దోపిడీ, ఒక దారిదోపిడీ, పగటిపూట చోరీ ఒకటి, రాత్రిపూట చోరీలు 12, బస్సు దొంగతనం ఒకటి, కారు, ఆటోలు, బైక్‌లు, బస్సు చోరీ కేసులు ఉన్నాయన్నారు. నిందితుల నుంచి 310 గ్రాముల బంగారం, 536 గ్రాముల వెండి, రూ.4.56 లక్షల నగదు, ఏడు మోటారు సైకిళ్లు, ఒక బస్సు, ఒక కారు, రెండు ... మిగతా 6వ పేజీలో



అందుబాటులోకి వాటర్ ప్యూరిఫయిర్



ప్యూరిఫయిర్‌ను ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థి పిసి అప్పారావు

భీమునిపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): భీమిలి నెహ్రూరా రోడ్డులో ఉన్న జీవీఎంసీ హైస్కూల్‌లో మరమ్మతు చేసిన ప్యూరిఫయిర్‌ను అందుబాటులోకి తెచ్చారు. స్కూలు పూర్వ విద్యార్థి, ఏపీ మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పీసీ అప్పారావు ఆర్థిక సహాయంతో మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను దుశ్శాలువ కప్పి స్కూలు కమిటీ ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ఎగువపేట గ్రామ నాయకులు, పైడిపల్లి నర్సింగరావు, గంటా నూకన్న, వీరుపల్లి రాంబాబు, ఆ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం అల్లాడ శ్రీనివాసరావు, మరగడ రామకృష్ణ, ఆల్తి రామకృష్ణ, అశోక్, రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పోలమ్మ



భీమునిపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా భీమిలి జోన్ 4వ వార్డు చేపలుప్పాడకు చెందిన తెలుగుదేశం మహిళా నాయకురాలు వాసుపల్లి పోలమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం బాపట్లలో మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర మహిళా కమిటీ రాష్ట్ర నాయకత్వ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా కోటా రాజేశ్వరి (అనంతపురం), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మేకల మరియమ్మ (ప్రకాశం) ఎన్నికవగా, రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా విశాఖ జిల్లా భీమిలికి చెందిన వాసుపల్లి పోలమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నేడు ఉత్సవ కమిటీ సమావేశం

భీమునిపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : భీమిలి గ్రామ దేవత నూకాలమ్మ వారి ఉత్సవ కమిటీ సమావేశం ఈనెల 19న నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం నూకాలమ్మ ఆలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మార్చిలో జరగనున్న నూకాలమ్మ ఉత్సవాలకు సంబంధించి నూతన ఉత్సవ కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు.

వైభవంగా అప్పన్న కల్యాణం



ఉభయ దేవేరులతో స్వామివారు

సింహాచలం, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామి ఆర్జిత నిత్య కల్యాణాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామిరిని మేల్కొలిపి ప్రభాతారాధనలను జరిపాక ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించాక పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణాన్ని జరిపారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

శ్మశానవాటికల అభివృద్ధి పనులు ప్రారంభం

భీమునిపట్నం (రూరల్), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగనబంద, మద్దిలపేట, డొకరపేట, లక్ష్మీపురం, మహారాజుపేటల్లోని వసతులు లేని శ్మశానవాటికలకు కనీస సదుపాయాలు కల్పించే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఆయా అభివృద్ధి పనులను జడ్పీటీసీ గాడు వెంకటప్పడు ప్రారంభించారు. శ్మశానవాటికలకు వెళ్లేందుకు రహదారులను, అంత్యక్రియలు సజావుగా నిర్వహించేందుకు పలు వసతులు కల్పిస్తామని సింగనబంద సర్పంచ్ జీవీ నారాయణ తెలి పారు. ఆయా పనుల కోసం జడ్పీటీసీ, మండల పరిషత్ నిధులు కేటాయించడం జరిగిందన్నారు.

'బాలల హక్కుల' రాష్ట్ర కన్వీనర్‌గా విశాలాక్షి



సాగర్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కన్వీనర్, విశాఖ జిల్లా కో-ఆర్డినేటర్‌గా సీహెచ్ విశాలాక్షిని ఇటీవల విజయవాడలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఎం.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమెను ఎనుకున్నారు. విశాలాక్షి నియామకం పట్ల విశాఖ స్వచ్ఛంద సంస్థల ఫోరమ్, రాష్ట్ర బాలల హక్కుల సలహాదారుడు నరవ ప్రకాశరావు హర్షం వ్యక్తం చేశారు.

జనావాసాల సమీపంలో సెప్టిక్ ట్యాంకు వ్యర్థాల డంపింగ్

» దుర్గంధంతో పలు గ్రామాల ప్రజల ఇబ్బందులు

భీమునిపట్నం (రూరల్) ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కొందరు ప్రైవేటు వాహనాలతో సెప్టిక్ ట్యాంకుల కొన్ని గ్రామాల సమీపంలో పడేస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు దుర్గంధంతో ఇబ్బంది పడుతులున్నారు. రోజూ చీకటి పడగానే విజయనగరం, తగరపువలస ప్రాంతాల నుంచి వ్యర్థాలను సెప్టిక్ ట్యాంకు వాహనాలతో తెచ్చి మహారాజుపేట, కొండరాజుపేట, అల్లుపేట, దాకమర్రి, బోడమిట్లపాలెం తదితర గ్రామాల సమీపంలో ఉన్న తుప్పల్లో వేస్తున్నారు. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

సాధారణంగా సెప్టిక్ ట్యాంకు నిండిన తర్వాత ఇంటి యజమానులు, అపార్ట్‌మెంటు వాసులు వ్యర్థాలను తీసివేయిస్తారు. సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేసే వారు గొట్టాల ద్వారా ట్యాంకులోకి వ్యర్థాలను తీసి వాహనంలో నింపుతారు. అనంతరం ఆ వ్యర్థాలను దూరంగా తీసుకెళ్లి పారబోస్తారు. సెప్టిక్ ట్యాంకుల వ్యర్థాలు కావడంతో తీవ్ర దుర్గంధం ఉంటుంది. నివాస ప్రాంతాల సమీపంలో కాకుండా నిర్జీవ ప్రదేశాల్లో ఈ చెత్తను వేస్తే ఏ సమస్యా ఉండదు. అయితే సెప్టిక్ ట్యాంకుల నిర్వాహకులు తాము తీసిన వ్యర్థాలను ఇలా గ్రామాలు, ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో వేస్తుండడం సమస్యగా మారుతోంది.



అల్లుపేట రహదారి పక్క సెప్టిక్ వ్యర్థాలను డంపింగ్ చేస్తున్న వాహనం

ఇలా చేయడం వల్ల తీవ్ర దుర్గంధం తమ గ్రామాల్లోకి వ్యాపిస్తోందని, అలాగే ఈ మార్గం రాకపోకలు సాగించలేని ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు ప్రారంభం



మాటాడుతున్న ఐసీడీఎస్ పీవో చంద్రశేఖరరావు

ఆనందపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు నిర్వహించనున్న జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ జోగ చంద్రశేఖరరావు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక స్థాయిలో పాఠశాలలను బలోపేతం చేయడానికి ఈ శిక్షణా తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల మధ్య పిల్లలకు విద్యారంభంలోనే మెరుగైన పునాది, అభ్యసనం మెరుగుపరచడం, ఆరోగ్య సంరక్షణ కల్పించడం, వాటిని అమలు చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంవో దేవుడుబాబు, ఎంఈవో జోగేంద్రనాథ్, గంగరాజు, డీఆర్పీఎస్ ఉమామహేశ్వరరావు, రాంబాబు, రఘు రాముడు, రత్నం, అంగన్వాడీ కార్యకర్తలుపాల్గొన్నారు.

భీమునిపట్నంలో..

భీమునిపట్నం : పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించి అంగన్‌వాడీకార్యకర్తలకు ప్రభుత్వం జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తోందని భీమిలి ఎంఈవో మానేపల్లి శివరాణి తెలిపారు. మంగళవారం జీవీఎంసీ ఝాన్సీ లక్ష్మీబాయి ప్రాథమికోన్నత పాఠశాలలో 'ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ ఎఫ్ఎల్ఎన్ 120 రోజులు'లో భాగంగా మూడు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో ఎం.శ్రీదేవి, ఎంఈవో 2 అట్టాడ జయప్రద, ఎస్ఆర్పీలు సన్యాసినాయుడు, హరిణి, డీఆర్పీలు, ఎంఈవో కార్యాలయం సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

7వ వార్డులో కార్పొరేటర్, కూటమి నేతల పర్యటన



స్వతంత్రనగర్ కాలనీలో కాలువ పరిశీలిస్తున్న కూటమి నేతలు

మధురవాడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 7వ వార్డు పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మంగళవారం వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, పలువురు కూటమి నాయకులు పరిశీలించారు. స్వతంత్రనగర్ కాలనీ, బాపూజీనగర్, దోబీ కాలనీ, ప్రియదర్శినినగర్ తదితర ప్రాంతాల్లో కొన్ని చోట్ల కాలువలు లేకపోవడంతో పారిశుద్ధ్యం సమస్య ఏర్పడుతోంది. దీంతో ఆ ప్రాంతాలను టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిల్లా వెంకటరావు తదితరులు పరిశీలించారు. ఈ సమస్యలను జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆయా ప్రాంతాల్లో కాలువలు నిర్మాణానికి కృషి చేయనున్నట్టు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ తెలిపారు. అలాగే రానున్న వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి కొన్ని ప్రాంతాల్లో బోరుబావులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట్ల ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేయనున్నట్టు తెలిపారు.

ఈ వార్డులో పలు అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు కార్పొరేటర్ మంగమ్మ తెలిపారు.

కొత్తూరు ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడిగా కర్రి చిన్న



ధ్రువీకరణ పత్రం స్వీకరిస్తున్న చిన్న, కార్యవర్గ ప్రతినిధులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : భీమిలి జోన్-4వ వార్డు కొత్తూరు ఫిషర్‌మెన్ సొసైటీ నూతన అధ్యక్షుడిగా కర్రి చిన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ గ్రామంలో మంగళవారం మత్స్యకార అభివృద్ధి అధికారి మురళి ఎన్నికల అధికారిగా ఈ సొసైటీ ఎన్నిక నిర్వహించారు. సొసైటీ వైస్ ప్రెసిడెంట్‌గా ఉమ్మిడి దాసు, కోశాధికారిగా రాగతి రాజు, డైరెక్టర్లుగా సీహెచ్. ఎల్లాజి, వి.కిరణ్, వి.మురళి, ఆర్.శ్రీను ఎన్నికయ్యారు.

రుషికొండ తీరంలో గ్రీనరీ పనులు ప్రారంభం



గ్రీనరీలో ఏర్పాటులో నిమగ్నమైన కార్మికుడు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రుషికొండ సాగర తీరంలో ఉన్న పార్కులో పచ్చదనాన్ని పెంపొందించడానికి జీవీఎంసీ ఆధ్వర్యంలో మంగళవారం పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ పర్యవేక్షిస్తుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రుషికొండ బీచ్ అభివృద్ధికి దూరమైంది. దీంతో బీచ్‌లో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్కులో పచ్చదనం కనుమరుగైంది. అలాగే పార్కులో ఏర్పాటు చేసిన క్రీడా సామగ్రి తుప్పుపట్టి శిథిలావస్థకు చేరాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రుషికొండ బీచ్‌లో అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా బీచ్‌లో ఉన్న పార్కులో పచ్చదనాన్ని పెంపొందించే పనులు చురుగ్గా సాగుతున్నాయి.

ఘాట్ రోడ్డు నిర్మాణ పనుల జాప్యంపై గంటా ఆగ్రహం



సిబ్బందికి సూచనలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

పద్మనాభం-రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అనంత పద్మనాభ స్వామి ఆలయ ఘాట్ రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఘాట్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. దీపోత్సవానికి సిద్ధం కావాల్సిన రోడ్డు ఇంకా రెండు నెలలైనా పూర్తి కాకపోవడంపై అసంతృప్తి చెందారు. సంబంధిత కాంట్రాక్టర్ గైర్హాజరవ్వడం.. మరో వ్యక్తి పొంతనలేని సమాధానాలు చెప్పడంపై గంటా మండిపడ్డారు. పనులు వేగంగా జరగకపోవడానికి కారణమేమిటని నిలదీశారు. సదరు కాంట్రాక్టరుతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఘాట్ రోడ్డు ప్రారంభోత్సవానికి మూడుసార్లు గడువు తేదీలిచ్చి విఫలమైన సంగతిని గుర్తు చేశారు. రోడ్డు పని ఇంకా పెండింగ్ ఉన్నప్పటికీ, పనంతా పూర్తయిపోయిందని కాంట్రాక్టర్ చెప్పడాన్ని ఆయన ఆక్షేపించారు. సకాలంలో పనులు పూర్తి చేసే సామర్థ్యం లేనప్పుడు కాంట్రాక్టు ఎందుకు తీసుకున్నారని, నెల రోజుల్లో ఘాట్ రోడ్డు పని మొత్తం పూర్తి చేయకపోతే బ్లాక్ లిస్టులో పెట్టి వేరే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తామని గంటా హెచ్చరించారు. పనులు సజావుగా సాగకపోతే ఎందుకు ఉదాసీనంగా ఉంటున్నారని దేవస్థానం ఈవో నానాజీని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కోరాడ రమణ, కె.దామోదరరావు, కాళ్ల నగేశ్‌కుమార్, కె.లీలావతి, బీఆర్‌బీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యుపకారం చేయనివాడు మహా పాపాత్ముడు

ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

కొమ్మాది, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపకారం పొంది ప్రత్యుపకారం చేయనివాడు మహా పాపాత్ముడని, అలాంటి వ్యక్తుల ముఖం కూడా చూడకూడదని రామాయణం మనకు చెబుతుందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కొమ్మాది గాయత్రి ఇంజనీరింగ్ మహిళా కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణ ప్రవచనాల్లో భాగంగా మంగళవారం ఆయన కిష్కింధకాండ గురించి వివరించారు. వర్షాకాలం దాటి శరత్కాలం ప్రారంభమైనప్పటికీ భోగాలను అనుభవిస్తూ సీతాన్వేషణను మరచిపోయిన సుగ్రీవుడిపై కినుక వహించిన శ్రీరాముడు లక్ష్మణుడిని సుగ్రీవుని వద్దకు పంపి వాలి వెళ్లిన మార్గం ఇంకా మూసుకుపోలేదని.. ఉపకారం పొంది ప్రత్యుపకారం చేయకపోవడం మహా పాపమని గుర్తు చేయమని చెప్పడం గురించి సవివరంగా తెలియజేశారు. కార్యక్రమంలో అష్టలక్ష్మి ఆలయ ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

అనధికారిక వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీల తొలగింపు

తగరపువలస, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తగరపువలస పరిధిలో అనధికారికంగా ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలను జీవీఎంసీ భీమిలి జోన్ అధికారులు తొలగిస్తున్నారు. ఇష్టానుసారంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోస్టర్లు, ఫ్లెక్సీలను సిబ్బంది తీసివేస్తున్నారు. పలు వ్యాపార సంస్థలకు చెందిన ప్రచార పోస్టర్లతో పాటు సినిమాలు, రాజకీయ నాయకులు, తదితరులు ఏర్పాటు చేసిన వాటిని తొలగించే ప్రక్రియకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఇందుకోసం ఆరు బృందాలను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. వీటిని ఏర్పాటు చేయాలంటే ముందుగా జీవీఎంసీ అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఇందుకోసం నిర్దేత మొత్తంలో చలానాను చెల్లించాలి. కానీ చాలామంది ఎలాంటి అనుమతులు పొందకుండా ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ పోస్టర్లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో అధికారులు వాటిని తొలగిస్తున్నారు.



వాల్ పోస్టర్లను తొలగిస్తున్న సిబ్బంది

వైభవంగా రాధా మదన్ మోహన్‌స్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ

ఆనందపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంభీరం సమీపంలో ఉన్న హరేకృష్ణ మూవ్‌మెంట్ చైతన్య భవనంలో రాధా మదన్‌మోహన్‌స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తనకు స్వావారి తొలి దర్శన భాగ్యం లభించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ నిష్కించిన భక్త దాస, స్థానిక నాయకులు మజ్జి వెంకటరావు, కోరాడ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి పూజలు చేస్తున్న దృశ్యం

ఏయూ వీసీగా రాజశేఖర్

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుందంటున్నారు. విద్యా బోధనలో కీలక మార్పులు చేయడంతో పాటు పరిశోధనలకు పెద్దపీట వేసే ఆలోచనలో పాలకులు ఉన్నారు.

కీలక బాధ్యతలు

ప్రొఫెసర్ రాజశేఖర్ అనేక కీలక బాధ్యతలను నిర్వర్తించారు. గేట్-2014 ఆర్గనైజింగ్ చైర్మన్‌గా, 2014లో గేట్ అకడమిక్ స్టాండింగ్ కమిటీ కన్వీనర్‌గా, 2018-19లో ఐఐటీ ప్లేస్‌మెంట్ కమిటీ కన్వీనర్‌గా,2020లో జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ సభ్యుడిగా బాధ్యత లను నిర్వర్తించారు. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్‌గా, ప్లానింగ్ అండ్ కో-ఆర్డినేషన్ విభాగం డీన్‌గా, కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ డీన్‌గా, టెక్నాలజీ విజన్-2047 వర్క్‌షాప్ చైర్మన్‌గా, ఐఐటీ ఖరగ్‌పూర్ విజన్- 2030 డాక్యుమెంట్ కమిటీ చైర్మన్‌గా, కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ చైర్మన్‌గా సేవలు ఆయన అందించారు.

బయట నుంచి నియామకం ఇదే తొలిసారి..

ఆంధ్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్లుగా ఇప్పటివరకూ వర్సిటీకి చెందిన, రాష్ట్రంలోని ఇతర వర్సిటీల్లో పనిచేసిన వారినే నియమిస్తూ వచ్చారు. తొలిసారి ఐఐటీ ప్రొఫెసర్‌ను నియమించారు. ఇదిలావుంటే ఇన్‌చార్జి వీసీగా ఉన్న ప్రొఫెసర్ జి.శశిభూషణరావును రిలీవ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయన రిలీవ్ అయ్యారు. నూతన వీసీగా నియమితులైన ప్రొఫెసర్ రాజశేఖర్ వర్చువల్‌గా జాయినింగ్ ఆర్డర్స్ ఉన్నతాధికారులకు పంపిస్తారని, ప్రభుత్వ ఆదేశాలు వచ్చినప్పటి నుంచి ఆయన వీసీగా నియమితులైనట్టేనని ఏయూ అధికారులు చెబుతున్నారు.అధికారికంగా మంచి రోజు చూసుకుని వచ్చి బాధ్యతలు స్వీకరిస్తారంటున్నారు.

గడిచిన ఐదేళ్లలో యూనివర్సిటీలో రాజకీయాలు బాగా పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో బయట నుంచి సీనియర్ ప్రొఫెసర్‌ను తీసుకు రావడం ద్వారా వాటన్నింటికీ చెక్ చెప్పడంతో పాటు వర్సిటీ పాలనను గాడిలో పెట్టవచ్చునని ప్రభుత్వం భావించినట్టు చెబుతున్నారు. ఏది ఏమైనా తాజా నిర్ణయంతో వర్సిటీ ప్రతిష్ఠ ఇనుమడిస్తుందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. రాజకీయాలకు, వ్యక్తిగత అజెండాలకు దూరంగా వర్సిటీ పాలన సాగేందుకు అవకాశం ఉంటుం దని విశ్లేషిస్తున్నారు.

వీసీగా రాజశేఖర్ నియామకంపై సింహాచలం వాసుల హర్షం



రాజశేఖర్‌ను సన్మానిస్తున్న స్థానికులు(ఫైల్‌ఫొటో)

సింహాచలం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే పేరొందిన ఆంధ్ర విశ్వవిద్యాలయానికి తమ ప్రాంతవాసి ఉప కులపతిగా నియామకం కావడం పట్ల సింహాచలం వాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. వీసీగా నియమితులైన జీపీ రాజశేఖర్ తండ్రి బలరామకృష్ణ స్వస్థలం ఏ.కోడూరు. అయితే ల్యాబ్ టెక్నీషియన్‌గాసింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో చేరిన ఆయన పదవీ విరమణ చేసే వరకూ స్థానికంగానే ఉన్నారు. బలరామకృష్ణ, సావిత్రి దంపతులకు ఇద్దరు కుమారులు (రాజ శేఖర్, గిరిధర్), ఒక కుమార్తె (సునీత). రాజశేఖర్ ఒకటి నుంచి ఏడో తరగతి వరకూ సింహాచలం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠ శాలలో చదువుకున్నారు.ఆ తరువాత సెయింట్ ఆంథోనీ, ఏవీఎన్ కళాశాల, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలలో విద్యాభ్యాసం చేశారు. ప్రస్తుతం ఖరగ్‌పూర్‌లోని ఐఐటీలో గణితశాస్త్ర ఆచార్యునిగా పనిచేస్తున్నారు. గతంలో అడివివరం శాఖా గ్రంథాలయ వారోత్సవాలలో ఆయన్ను స్థానికులు సత్కరించారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఏయూ వీసీగా నియమించటం పట్ల మిత్రులు పాశర్ల ప్రసాద్, రాజనాల సత్యారావు, ఏర్ర దేవీ వరప్రసాద్‌లతోపాటు వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, మజ్జి సూరిబాబు, రచ్చా ఆనంద శ్రీనివాసవర్మ హర్షం వ్యక్తం చేశారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సేవలు అందేదెన్నడో?

... 5వ పేజీ తరువాయి

అవకాశం ఉంటుంది. ఆస్పత్రిలో 80 పడకలు అదనంగా రానున్నాయి. ఇందులో వృద్ధులకు 20, పిల్లలకు 20, వ్యసన విముక్తికి సంబంధించి మరో 40 పడకలతో ప్రత్యేకంగా వార్డులు ఉంటాయి. అందుకు అనుగుణంగా సిబ్బంది ఉంటారు. అలాగే, సైకియాట్రిక్ నర్సింగ్, క్లినికల్ సైకాలజీ, సైకియాట్రిక్ సోషల్ వర్క్ విభాగాలు అందుబాటులోకి వస్తాయి. ఒక్కో విభాగంలో 30 మందికి అడ్మిషన్లు ఇచ్చి మానసిక నిపుణులను తయారు చేయనున్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కోసం మూడు అంతస్థుల్లో సువిశాలమైన భవంతిని నిర్మించారు. ఇందులో అకడమిక్ బ్లాక్‌తోపాటు ఆయా కోర్సుల నిర్వహణకు అనుగుణంగా తరగతి గదులు, హాస్టళ్లు, మనో వికాస కేంద్రం ఏర్పాటు చేస్తారు. మరోచోట డీ అడిక్షన్ బ్లాక్‌ను ప్రత్యేకంగా నిర్మించారు.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ముందుకు

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అందుబాటులోకి వస్తే రోగులకు ఎంతో మేలు కలుగుతుంది. ఆ ఉద్దేశంతోనే ఆరోగ్య శాఖ మంత్రి కార్యాలయానికి విషయాన్ని తెలియజేశాం. వచ్చే నెలలో ప్రారంభించేలా ఏర్పాట్లు చేసుకుంటున్నాం. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళతాం. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వల్ల కొత్త విభాగాలు ఏర్పాటు కావడంతోపాటు మానసిక నిపుణులను తయారుచేసే ఇనిస్టిట్యూట్‌గా నిలుస్తుంది. అదే సమయంలో పలు పోస్టులు మంజూరవుతాయి. వివిధ కేడర్లకు సంబంధించి 120 వరకు కొత్త పోస్టులు మంజూరు అవుతాయి. మానసిక సమస్యలతో బాధపడే వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించే టాప్ ఇనిస్టిట్యూట్‌గా మారుతుంది.

- డాక్టర్ కేవీ రామిరెడ్డి, మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్

డేంజర్ జోన్

... 5వ పేజీ తరువాయి

చిల్డ్రన్ పార్కులోకి దూసుకుపోయింది.

శ్రీకాకుళం నుంచి ఇసుకలోడుతో వచ్చిన లారీ పందిమెట్ట జంక్షన్ నుంచి ఫిషింగ్ హార్బర్‌కు వెళ్లే క్రమంలో నోవాటెల్ డౌన్ దిగుతుండగా అదుపుతప్పడంతో నేరుగా బీచ్‌రోడ్డు రక్షణగోడను ఢీకొంది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అయితే లారీ అమిత వేగంతో గోడను ఢీకొట్టడంతో రాళ్లు గాల్లోకి ఎగిరిపడడంతో సమీపంలో వాకింగ్ చేస్తున్న వన్‌టౌన్‌లోని దిగువ రెల్లి వీధికి చెందిన తుపాకుల వెంకటరవికుమార్ తలకు గాయమైంది. రవికుమార్‌ను వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు.

అక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయనే రక్షణ గోడపై కూర్చునే సందర్శకులకు, రక్షణ గోడ వెనుక గల రోడ్డులో నడిచేవారికి, దాని వెనుక భాగంలో తీరానికి ఆనుకుని ఉన్న చిల్డ్రన్‌పార్కులో ఉన్నవారికి ఎలాంటి నష్టం జరగకుండా ఉండేందుకు నోవాటెల్ డౌన్‌కు ఎదురుగా బీచ్‌రోడ్డులో ప్లాస్టిక్ బ్లాక్‌లను ఏర్పాటుచేశారు. కానీ ఇసుక లారీ అమిత వేగంతో దూసుకురావడంతో ఆ బ్లాక్స్ చెల్లాచెదురైపోయాయి. లారీ రక్షణ గోడను, దాని వెనుకవున్న రోడ్డును దాటి తీరం వైపు ఉన్న చిల్డ్రన్ పార్కు లోపలకు దూసుకుపోయింది. ఆ వేగానికి పార్కు ప్రహరీ గోడ ధ్వంసమైంది. లారీ ముందు భాగం కూడా పూర్తిగా దెబ్బతింది. లారీ అపరిమిత వేగంతో రావడం చూసి బీచ్‌రోడ్డులో హార్బర్ వైపు వెళుతున్న కారును డ్రైవర్ ఆపేశారు. అలాకాకుండా లారీ వచ్చేలోపు వెళ్లిపోవచ్చునని ముందుకు వెళ్లినట్టయితే కారు నుజ్జయ్యేదని సీసీ పుటేజీని చూసినవారంతా అభిప్రాయపడుతున్నారు.

66 చోరీ కేసుల్లో 74 మంది అరెస్టు

... 5వ పేజీ తరువాయి

ఆటోలు, నాలుగు ల్యాప్‌టాప్‌లు, రెండు టీవీలు, 313 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నగరంలో నేరాలను నియంత్రించేందుకు శివారు ప్రాంతాల్లో వీధి దీపాల ఏర్పాటు, తుప్పల తొలగింపు, సీసీ కెమెరాలను ఏర్పాటు, రాత్రి క్రైమ్ బీట్‌లు పెంపు వంటివి చేస్తున్నామన్నారు. పాతనేరస్థుల కదలికలపై నిఘా ఉంచామన్నారు. చోరీ కేసుల్లో రికవరీని ప్రతి నెలా మెరుగుపరుచుంటూ వెళుతున్నామని సీపీ వివరించారు.ఐపీఎస్ సీజన్ ప్రారంభం కాబోతుండడంతో బెట్టింగ్ నియంత్రణపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేస్తామని పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ అన్నారు. బెట్టింగ్ కేసుల్లో ఇప్పటికే 12 మందిని అరెస్టు చేశామని, మరికొందరిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. బెట్టింగ్‌కు పాల్పడేవారు, నిర్వహించేవారు ఎంతటి వారైనప్పటికీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని సీపీ స్పష్టంచేశారు. అలాగే నగరంలో రాత్రిపూట బైక్ రేసింగ్‌లు జరుగుతున్నట్టు తనకు ఫిర్యాదులు అందుతున్నాయని, వాటికి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల స్వయంగా తానే అర్ధరాత్రి దాటిన తర్వాత నగరంలో పరిస్థితిని పరిశీలించేందుకు తిరుగుతుండగా తెలుగుతల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద కొందరు యువకులు బైక్ రేసింగ్‌కు పాల్పడుతున్నట్టు గుర్తించానన్నారు. వారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. ఈ సమావేశంలో క్రైమ్ డీసీపీ లతా మాదురి, ఏడీసీపీ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరణ

... 5వ పేజీ తరువాయి

తెలిపారు. 07025 నంబరు గల రైలు ఈ నెల 21వ తేదీ రాత్రి 9.15 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.45 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07026 నంబరు గల రైలు ఈ నెల 22న మధ్యాహ్నం 2.15 గంటలకు శ్రీకాకుళం రోడ్డులో బయలుదేరి సాయంత్రం 4.45 గంటలకు దువ్వాడ, మరుసటిరోజు ఉదయం 6 గంటలకు చర్లపల్లి చేరుతుంది. ఈ రైళ్లు నల్లగొండ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, అన్నవరం మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

పలు రైళ్లు రద్దు

నిర్వహణ పనుల దృష్ట్యా విశాఖ నుంచి షాలిమార్ వెళ్లే 22854 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలును బుధవారం (19న) రద్దు చేశారు. ఈ నెల 21న సంత్రాగచ్చి-ఎంజీఆర్ చెన్నై ఎక్స్‌ప్రెస్ (22807), 23న ఎంజీఆర్ చెన్నై-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ (22808)ను రద్దు చేశామని రైల్వే అధికారులు తెలిపారు.



పూజలందుకున్న పైడిమాంబ అమ్మవారు

ఘనంగా పైడిమాంబ మారు వారం పండగ

ఎన్.ఎడీ జంక్షన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరాజుపాలెం పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దైవం పైడిమాంబ మారువారం పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, కుంకుమ పూజలు చేశారు. గత వారం మొక్కులు చెల్లించుకోలేని భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారికి పసుపుకుంకుమలు, మొక్కులు అర్పించారు. సీతారామగౌరీ మహిళా కోలాట బృందం వారి కోలాటం ఆకట్టుకుంది. సాయంత్రం అమ్మవారి చరిత్రపై వేపగుంట నివాసి గంగరాజు ప్రవచనం చేశారు. ఆలయ ఈవో పీఎస్ఎన్.మూర్తి, అనువంశిక ధర్మకర్త ప్రకాశ్‌రెడ్డి, మళ్ల అప్పారావు, డి.సతీశ్, రామచంద్రరావు, చిన అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఉక్కు నిర్వాసిత కాలనీ డొంకాడ గ్రామస్తుల ఇలవేల్పు దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టనున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జరిగే పరసలో పలు సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నామని ఆలయ కమిటీ ప్రతినిధి దాసరి త్రినాథరావు తెలిపారు.

పాదాలమ్మ ఆలయంలో పూజలు

కూర్మన్నపాలెం: గ్రేటర్ 86వ వార్డు పరిధి లక్కరాజుపాలెంలోని శ్రీపాదాలమ్మ ఆలయంలో మంగళవారం టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు జరిపారు. అనంతరం ఆలయ అభివృద్ధి కోసం పది వేల రూపాయలను ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వేగుంట శ్రీనివాస్, నాగార్జున, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం),
● **తండేల్ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ(గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
● **మదగజరాజ :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం),
● **సంక్రాంతికి వస్తున్నాం :** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్ :** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ,కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 37, టమాటా 11, వంకాయలు (తెలుపు) 14, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 42, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 34, బీరకాయలు 60, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 14, క్యాబేజీ 12, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 14, అరటికాయ (పెద్దది) 6, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది) 48, బరబాటి 28, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 120, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 36, కీరదోస 30, క్యాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 32 చిలగడ దుంపలు 30, కంద 64, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

సర్కారు స్థలానికి ఎసరు?

» ఎఫ్‌సీఐ గోదాం ప్రహరీ వెనుక చదును చేసిన వైనం
» నీరు నిలువలేకుండా తూము ఏర్పాటు
» రెవెన్యూ అధికారులు స్పందించాలంటున్న స్థానికులు



చినముషిడివాడలో ఎఫ్‌సీఐ గోదాం ప్రహరీ వెనుక చదును చేసిన ప్రభుత్వ స్థలం

పెందుర్తి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయడంలో అక్రమార్కులు రోజుకోవిధంగా వ్యవహరిస్తున్నారు. ఖాళీ స్థలం కనపడితే చాలు.. పక్కా ప్లాన్‌తో దానిని హస్తగతం చేసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. తాజాగా గ్రేటర్ 97వ వార్డు చినముషిడివాడలోని ఎఫ్‌సీఐ గౌడౌన్స్ ప్రహరీ వెనుక సర్వే నంబరు 44లో 1.4 ఎకరా ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసే యత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడి స్థలం ఎఫ్‌సీఐ గోదాములకు ఆనుకుని ఉండడం ఆక్రమణదారులకు కలిసివచ్చిందంటున్నారు.

పూర్వం చినముషిడివాడ కోమటి చెరువు నుంచి గెడ్డ ద్వారా ప్రవహించే నీరు ఇక్కడి ప్రభుత్వ స్థలానికి చేరేది. ఇక్కడ ఊట మాదిరిగా ఏర్పటి రోజులతరబడి నిలిచిపోయి ఉండేది. అయితే కాలక్రమంలో ఈ స్థలం రస్తాగా మారింది. సమీప భూముల్లో లేఅవుట్‌లు వెలియడం, ఇళ్ల నిర్మాణాలు చేపడుతుండడంతో ఇక్కడ భూమి విలువ రూ.కోట్లకు చేరింది. ఈ క్రమంలో రస్తాగా మారిన స్థలాన్ని చేజిక్కించుకునేందుకు అక్రమార్కులు పక్కా స్కెచ్ వేశారు. ముందుగా గ్రావెల్, డెబ్రిస్‌ను డంప్ చేసి స్థలాన్ని చదును చేశారు. అంతేకాకుండా ఈ స్థలంలో నీరు నిలిచిపోయి, లోతట్టు ప్రాంతాలు జలమయం కాకూడదనే చదును చేస్తున్నామని స్థానికులకు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నీరు దిగువకు వెళ్లిపోయేలా గొట్టాలను కూడా అమర్చారు. అయితే ప్రభుత్వ స్థలాన్ని చేజిక్కించుకునే ప్రయత్నంలో భాగంగానే ఇదంతా జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఈ స్థలం సమీపంలో ప్రైవేటు లేఅవుట్ ఉండడంతో గజం స్థలం రూ.20 వేలకు పైగానే ధర పలుకుతోంది. చదును చేసిన స్థలాన్ని ప్లాట్లుగా విభజించి, గుట్టుచప్పుడు కాకుండా విక్రయించేందుకు అక్రమార్కులు రంగం సిద్ధం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆ దిశగా రాజకీయ పలుకుబడితో పావులు కదుపుతున్నారంటున్నారు. ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించేలా రెవెన్యూ అధికారులు మేల్కొనకుంటే రూ.కోట్ల విలువైన స్థలం పరాధీనమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

స్థలాన్ని సర్వే చేస్తాం

చినముషిడివాడ ఎఫ్‌సీఐ గోదాం సమీపం లో గల ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించేలా చర్యలు తీసుకుంటాం. ఆ స్థలానికి సర్వే చేసి, హద్దులు నిర్ణయిస్తాం. శాఖాపరమైన విచారణ చేపట్టి స్థలాన్ని ల్యాండ్‌బ్యాంకులో నమో దు చేస్తాం. ఎవరైనా ఆక్రమణకు యత్నిస్తే కేసులు నమోదు చేస్తాం.

-ఆనంద్‌కుమార్, తహసీల్దార్, పెందుర్తి



పైపు లైన్ పనులు ఆగిపోవడంతో గోతులను పూడ్చి వేసిన దృశ్యం



నెల రోజులుగా పనులు సాగక రోడ్డు పక్కన ఉన్న పైపులు

టిడ్కో ఇళ్లకు ఆగిన తాగునీటి పైపు లైన్ పనులు

» నెల రోజులవుతున్నా పట్టించుకునే నాథులే కరువాయె..
» ఎమ్మెల్యే గణబాబు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్న లబ్ధిదారులు

మల్కాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అచ్చినాయుడు తోట వద్ద గల టిడ్కో ఇళ్లకు మంచినీటి సరఫరా కోసం జరుగుతున్న పైపులైన్ పనులు సుమారు నెల రోజులుగా నిలిచిపోయాయి. దాదాపు రూ.మూడున్నర కోట్ల వ్యయంతో గాజువాక కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి అచ్చినాయుడు తోటకు పైపు లైన్ ఏర్పాటు కోసం పనులు ప్రారంభించారు. ఈ పనులను గాజువాక ఆర్టీసీ డిపో వద్దనున్న తాగునీటి రిజర్వాయర్ నుంచి ప్రారంభించారు. ఇందుకోసం శ్రీహరిపురం ప్రధాన రహదారి పొడవునా పైపులైన్ కోసం గోతులు తవ్వి పైపులు వేయడం చకచకా చేపట్టారు. అయితే ఆ తరువాత ఏం జరిగిందో గానీ ఒక్కసారిగా ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. నెల రోజులవుతున్నా మళ్లీ పనులు ప్రారంభం కాలేదు. ఈ పనులు ఎందుకు ఆగిపోయాయో ఎవరూ సమాధానం చెప్పడం లేదు. త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెబుతున్నారే తప్పా ఆగిపోవడానికి గల కారణాలపై బదులివ్వడం లేదు. కాగా అచ్చినాయుడుతోటలో టిడ్కో ఇళ్ల నిర్మాణం పనులు దాదాపుగా పూర్తయ్యాయి. విద్యుత్ కనెక్షన్ల పనులు కూడా పూర్తయ్యాయని, ఇంకా తాగునీటి సరఫరా పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని పలువురు లబ్ధిదారులు పేర్కొంటున్నారు. దీనిపై పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు స్పందించి పైపు లైన్ పనులు త్వరితంగా పూర్తయ్యేలా చూడాలని వారు కోరుతున్నారు.

విద్యా విధానంలో మార్పులు అనివార్యం

సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి లక్ష్మి



అంగన్‌వాడీల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మి

పెదగంట్యాడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా విద్యా విధానంలో కూడా మార్పులు అనివార్యమని విద్యాశాఖ సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ లక్ష్మి అన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ, మహిళాభివృద్ధి శిశు సంక్షేమం, పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు సంయుక్తంగా మంగళవారం మండల అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞాన జ్యోతి పేరిట శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నడుపూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నూతన విద్యా విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, అందుకు అనుగుణంగా అంగన్‌వాడీ టీచర్లకు ఆరు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులను గుర్తించి వారిని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు.

ఎంఈవో ఈ.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యా విధానంలో మార్పులు వస్తే ఆ ప్రభావం సమాజంపై పడుతుందన్నారు. బాలికల్లో శత శాతం విద్యావంతులు కావాలని, అప్పుడే రాష్ట్రంలో కూడా విద్యావంతుల శాతం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలకు రీసోర్స్ పర్సన్‌లుగా ఎస్‌పీఎస్ఎస్ఎ స్ఎల్ఎం మూర్తి, ఎన్.సూరిబాబు, షేక్ రంజాన్‌లు వ్యవహరించగా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డి.సుజాత, ఎ.లక్ష్మి, ప్రథమ ఫౌండేషన్ ప్రతినిధి ప్రమీల, సీఆర్పీలు, 52 అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావ దినోత్సవాన్ని జరపకపోవడం శోచనీయం

» ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు



అమరులకు నివాళులర్పించాక మాట్లాడుతున్న కార్మిక నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ ఏడాది నిర్వహించకపోవడం శోచనీయమని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. ఉక్కు కర్మాగారం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్లాంట్ కోసం ప్రాణ త్యాగం చేసిన 32 మంది అమరులకు వారు నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది వేడుకలు జరపకపోవడంతో ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారన్నారు. ఎందువల్ల వేడుకలను జరపలేదో ఉక్కు యాజమాన్యం ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్రం స్పష్టమైన హామీ ఇవ్వాలని, ప్రైవేటీకరణ కత్తి ఇంకా ప్లాంటుపై వేలాడుతుందన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు డి.ఆదినారాయణ, కేఎస్ఎన్ రావు, జె.అయోధ్యరామ్, వీవీ రమణమూర్తి, యు.రామస్వామి, వరసాల శ్రీనివాసరావు, విళ్లా రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో కేక్ కటింగ్

వైఎస్సార్‌టీయూసీ ప్లాంట్ నాయకుల ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగార ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని కేక్ కట్ చేశారు. యూనియన్ కన్వీనర్ మార్టుపూడి పరదేశి మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతికగా స్టీల్‌ప్లాంట్ నిలుస్తుందన్నారు. నాయకులు అప్పారావు, పిట్టా రెడ్డి, రవి, అప్పలరెడ్డి, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

జైళ్లశాఖ అధికారులపై ప్రభుత్వం చర్యలు

అమరావతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం సెంట్రల్ జైలులో జరిగిన వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసింది. మరో 16మందికి చార్జ్ మెమోలు జారీ చేసి సంజాయిషీ అడిగింది. వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన విశాఖ కేంద్ర కారాగారంలో సెల్‌ఫోన్లు గుర్తించడం, జైలు లోపలికి గంజాయి సరఫరా వంటి ఘటనల నేపథ్యంలో జైళ్లశాఖ అధికారులపై సిబ్బంది గత డిసెంబరులో ఆందోళనలకు దిగిన విషయం తెలిసిందే. దీనిపై హోంశాఖ మంత్రి అనిత జైలును సందర్శించి బాధ్యులపై చర్యలు చేపడతామంటూ ఉన్నతాధికారులతో విచారణ చేయించారు.

నివేదిక వచ్చిన తర్వాత జైలు సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాస్ పనితీరులో లోపం ఉన్నట్లు తేల్చి ఆయనతో పాటు మరో సూపరింటెండెంట్ జవహర్‌బాబును సస్పెండ్ చేస్తూ తాజాగా ప్రభుత్వం జీవో విడుదల చేసింది. విశాఖ జైలు మరో సూపరింటెండెంట్ ఎస్.కిశోర్ కుమార్, అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వర్లుపైనా చర్యలు తీసుకుంది.

బీజేపీ ఆధ్వర్యంలో ఎంపీ సీఎం రమేశ్ జన్మదిన వేడుకలు

పెందుర్తి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ జన్మదిన వేడుకలను బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు అందజేశారు. అనంతరం ఆలయాల్లో పూజలు చేయడంతో పాటు లయోలా వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు.

పెందుర్తి-రూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి సుజాతనగర్ ఆకార్ అనాథ బాలికల ఆశ్రమంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆధ్వర్యంలో ఎంపీ సీఎం రమేశ్ జనదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి బాలికలకు తినిపించారు. అనంతరం వారితో కలిసి కార్పొరేటర్, ఇతర నాయకులు అల్పాహారం తిన్నారు.

దివ్యాంగుల క్రీడల్లో సేవతకు రజత పతకాలు



సేవిత మహర్షి

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం కొచ్చిలో ఇటీవల జరిగిన మూడో డౌన్ సిండ్రోమ్ జాతీయ (మానసిక దివ్యాంగుల) క్రీడల పోటీల్లో షీలానగర్‌కు చెందిన ఓ ప్రైవేటు స్కూల్ విద్యార్థిని వేమూరి సేవిత మహర్షి రెండు పతకాలను సాధించింది. సేవిత 50 మీటర్ల పరుగు, సాఫ్ట్‌బాల్ పోటీల్లో రజత పతకాలను సొంతం చేసుకుంది. మూడో తరగతి చదువుతున్న సేవిత జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించడం పట్ల స్కూల్ ప్రిన్సిపాల్ లలితకుమారితో పాటు స్థానిక నాయకులు గుమ్మడి రామాంజనేయులు, వి.గోపి, యు.ప్రవీణ్ తదితరులు అభినందనలు తెలిపారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్ నమోదును పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు అన్నారు. వార్డులో మంగళవారం టౌన్‌షిప్‌లో ఆధార్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఈ కేంద్రం ద్వారా పలు సేవలు పొందవచ్చన్నారు. ఆధార్‌లో తప్పులు, ఫోన్ నెంబర్, పుట్టిన తేది అప్‌డేట్ వంటివి అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరాజు, పుల్లారావు, రాజా, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీసీఆర్ శ్రీనివాసరావు

ఆస్తి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలి

డీసీఆర్ ఎస్.శ్రీనివాసరావు

గాజువాక, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూళ్లను మరింత వేగవంతం చేయాలని జీవీఎంసీ రెవెన్యూ విభాగం డిప్యూటీ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. గాజువాకలోని జోనల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ విభాగ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ శత శాతం పన్నులు వసూలు చేసేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఎక్కువ మొత్తంలో పన్ను చెల్లించాల్సిన మొండి బకాయిదారుల నుంచి వసూళ్లు రాబట్టేందుకు ప్రయత్నించాలన్నారు. ప్రతి వార్డులో రెవెన్యూ సంబంధిత బృందాలు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఏ ఏ వార్డులో ఎంతమేర పన్నులు వసూలు కావాల్సి ఉందో సంబంధిత సచివాలయ అడ్మిన్లను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ వార్డుల్లోకి వెళ్లి పన్నులు చెల్లించేలా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సమావేశంలో జోనల్ కమిషనర్ శేషాద్రి, ఆర్వో శ్రీకాంత్, ఆర్ఐలు శివ, రెడ్డి మోహన్, సచివాలయాల అడ్మిన్లు పాల్గొన్నారు.

‘గాజువాక’లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ఓటర్లు 809 మంది

» మహిళలు 518, పురుషులు 291..
» రెండు మండలాల్లో ఒక్కొక్క పోలింగ్ స్టేషన్ ఏర్పాటు

గాజువాక, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి గాజువాక నియోజకవర్గ పరిధిలో ఉన్న గాజువాక, పెదగంట్యాడ మండలాలకు సంబంధించి మొత్తం 809 మంది ఓటర్లు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వీరందరికీ గత రెండు రోజులుగా ఓటర్ స్లిప్పులను వీఆర్వోలు పంపిణీ చేస్తున్నారు. గాజువాక మండలంలో 455 మంది మహిళలు, 253 మంది పురుష ఓటర్లు ఉన్నారు. అలాగే పెదగంట్యాడ మండలంలో మహిళా ఓటర్లు 63 మంది, పురుషులు 38 మంది ఉన్నారు. నియోజకవర్గ మొత్తం మీద మహిళలు 518 మంది, పురుషులు 291 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లను చూసుకుంటే పురుషుల కన్నా మహిళలే అధికంగా ఉన్నారు. ఈ ఎన్నిక ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 జరగనుంది. కాగా గాజువాక మండలానికి సంబంధించి గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోను, పెదగంట్యాడ మండలానికి సంబంధించి నడుపూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోను పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

చురుగ్గా చంద్రనగర్ అండర్ పాస్‌వేపై షెల్టర్ నిర్మాణ పనులు



అండర్ పాస్‌వేపై షెల్టర్ నిర్మిస్తున్న దృశ్యం

గోపాలపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి చంద్రనగర్ అండర్ పాస్‌వేపై షెల్టర్ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సింహాచలం రైల్వే స్టేషన్ వెనక భాగంలో ఏడాది క్రితం అండర్‌పాస్‌వే నిర్మాణాన్ని చేపట్టారు. ఈ అండర్ పాస్‌వే నిర్మాణం చేపట్టాక గోపాలపట్నం దిగువ ప్రాంతాల్లో గల సుమారు పది గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది. అండర్‌పాస్‌వేల నిర్మాణం తరువాత భారీ వాహనాల రాకపోకలకు కాస్త మార్గం సుగమమైంది. అయితే అండర్ పాస్‌వేపై షెల్టర్ లేకపోవడంతో వర్షం కురిసే సమయంలో అండర్ పాస్‌వే జలమయమై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో అండర్ పాస్‌వేపై షెల్టర్ నిర్మాణ పనులను ప్రారంభించారు.

రూ.27 వేలకు బాబా లడ్డూను దక్కించుకున్న భక్తుడు



వేలం పాటలో లడ్డూను దక్కించుకున్న భక్తుడు నారాయణస్వామి

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు పరిధి శాతవాహన నగర్‌లో షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పదికిలోల లడ్డూకు మంగళవారం వేలం పాట నిర్వహించగా కూర్మన్నపాలేనికి చెందిన టీవీఎస్ నారాయణస్వామి అనే భక్తుడు రూ.27 వేలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లుగా తాను బాబా లడ్డూను దక్కించుకోవాలని యత్నించగా, ఈ ఏడాది ఆ అదృష్టం దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. లడ్డూ ప్రసాదాన్ని బంధువులు, స్నేహితులకు పంపిణీ చేయడంతో పాటు పొలాల్లో వేస్తే అత్యధిక పంట దిగుబడి వస్తుందన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు బండ్రెడ్డి శేషగిరిరావు, కాట్రగడ్డ దుర్గాప్రసాద్, వేములపల్లి రామచంద్ర రావు, ఎం.శ్రీనివాస రావు, పి.ధనుంజయరెడ్డి, సాయిరామ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషతో పాటు ఆంగ్లంపై పట్టు సాధించాలి

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మాతృభాషతో పాటు ఆంగ్లం, హిందీపై విద్యార్థులు పట్టు సాధించాలని అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ హెచ్‌ఎం ఎంఎల్ఎస్ కాంతం అన్నారు. ఆంగ్ల భాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం హైస్కూల్‌లో ఆంగ్లంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విదేశాలలో ఉన్నత విద్యలకైనా, ఉపాధి సాధించేందుకైనా ఇంగ్లిష్ భాషపై మంచి పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.కుమారస్వామి, ఉషారాణి, గిరిబాబు, మహ్మద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది.

ఇంటక్ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం నడుపూరు యూనియన్ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ఇంటక్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు కేక్ కట్ చేశారు. ఇంటక్ నేతలు మంత్రి శంకర నారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నమ్మి అప్పలనాయుడులు మాట్లాడుతూ సంజీవరెడ్డి తన జీవితమంతా కార్మికుల హక్కుల కోసం పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో ఇంటక్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు వంశీకృష్ణ, నాయకులు కె.అవతారం, మంత్రి గోపీనారాయణ, నగేశ్, గోపి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: నష్టాల్లో వున్న బీహెచ్‌పీవీని బెల్‌లో విలీనం చేయడంతో పాటు ఆర్, డీ-సిరీస్ కార్మికులను పర్మినెంట్ చేయించడంలో ఇంటక్ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి చేసిన కృషిని కార్మికులు మరచిపోరాదని ఇంటక్ భెల్ సీనియర్ నాయకుడు వి.తాతారావు అన్నారు. భెల్ హెచ్‌పీవీపీ యూనియన్ కార్యాలయంలో సంజీవరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకు కేక్ కట్ చేశారు. నాయకులు ఉరుకూటి బాబూరావు, సీహెచ్ మురళీశ్వరావు, ఎస్.జగన్నాథరావు, చిట్టిబాబు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అమ్మవారికి స్వర్ణ పుష్పాలతో అలంకరణ

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం అష్టదళ పద్మారాధన సేవలు నిర్వహించారు. 108 స్వర్ణ పుష్పాలతో అమ్మవారిని అలంకరించి పూజలు జరిపించారు. అనంతరం పెద్దసంఖ్యలో విచ్చేసిన భక్తులకు దర్శనావకాశం కల్పించారు. ఆలయ జేఈవో తిరుమలేశ్వరరావు, మండపం ఉద్యోగులు, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు.

రైతుబజార్‌లో విజిలెన్స్ బృందం ఆకస్మిక తనిఖీ



రైతుతో మాట్లాడుతున్న డీడీ పాపారావు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):నరసింహనగర్ రైతుబజార్‌లో విజిలెన్స్ డిప్యూటీ డైరెక్టర్ పి.పాపారావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు పండిస్తున్న పంట వివరాలు తెలుసుకున్నారు. ఇకపై రైతుబజార్‌కు తీసుకొచ్చే ప్రతి పంట ఉత్పత్తి రైతుల నుంచి కొనుగోలు చేసి తీసుకురావాలని, దళారీల నుంచి కొనుగోలు చేయరాదని ఆదేశించారు. తనిఖీ బృందంలో జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కిరణ్, డీఏటీఎంవో ఎస్‌కే యాసిన్, ఏఎంసీ కార్యదర్శి అరుణ, భీమిలి ఏఎంసీ సహాయ కార్యదర్శి లక్ష్మీచైతన్య ఉన్నారు.

స్వల్పకాలిక కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల్లో ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్న స్వల్పకాలిక కోర్సుల శిక్షణకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది వ్యవధి గల ఇండస్ట్రియల్ సేఫ్టీ (60 సీట్లు), ఆరు నెలల వ్యవధి గల ఫైర్ సేఫ్టీ (30), నాలుగు నెలల వ్యవధితో ఆఫీస్ ఆటోమేషన్ (20), మూడు నెలల వ్యవధితో కెమికల్ సూపర్ వైజరీ ప్రోగ్రాం (20) సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పదో తరగతి, డిగ్రీ ధ్రువపత్రాలతో దరఖాస్తులు అందజేయాలన్నారు.

'అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ వద్దు'



వినతిపత్రం పరిశీలిస్తున్న విద్యుత్ ఏఈ

సీతమ్మధార, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలోని గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయం, ఏడు గుడులు ఎదురుగా ప్రభుత్వ స్థలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయొద్దని నక్కవానిపాలెం గ్రామకమిటీ విజ్ఞప్తి చేసింది. ఆలయం వెనుక గల అపార్టుమెంట్‌లో 20 యూనిట్లకు సంబంధించిన విద్యుత్ టాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రమాదకరమని పేర్కొంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును నిలిపివేయాలని కోరుతూ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుడ్ల కాటారాజు రెడ్డి ఏపీఈపీడీసీఎల్ ఏఈ గోపినాథ్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ విషయమై ఏఈని ప్రశ్నించగా తమకు ఇంకా దరఖాస్తు అందలేదన్నారు. భక్తులకు ప్రమాదం ఉంటుందంటే అనుమతి ఇవ్వబోమని ఏఈ తెలిపారు.

'ప్రజలు తిప్పికొట్టినా మారని జగన్ తీరు'

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజలు ముఖం ఎత్తుకోలేని విధంగా తీర్పు ఇచ్చినా ఇంకా బుద్ధి రాలేదని ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు విమర్శించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే వంశీని చూడటానికి విజయవాడ వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను బెదిరిస్తూ మాట్లాడారని, అతడి పద్ధతి ఇంకా మారలేదన్నారు. తప్పుచేసిన వారిపై అధికారులు చట్టప్రకారం చర్యలు చేపడితే, వారిని గుర్తు పెట్టుకొని మరీ వేధిస్తామని హెచ్చరించడం దారుణమన్నారు. ప్రజలు ఎందుకు తిరస్కరించారో జగన్ ఇప్పటికైనా అర్థం చేసుకోవాలని హితవు పలికారు.

విద్యుత్ సేవల్లో లోపాలుంటే సంప్రదించండి

ప్రజలకు సీజీఆర్ఎఫ్ చైర్మన్ సూచన



వినియోగదారు నుంచి ఫిర్యాదు అందుకుంటున్న చైర్మన్ సత్యనారాయణ, చిత్రంలో అధికారులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (సీజీఆర్ఎఫ్) చైర్మన్, జిల్లా విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. తాటిచెట్లపాలెం సెక్షన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు అక్కయ్యపాలెం ఎనభై అడుగుల రోడ్డు మాదేటి గార్డెన్స్‌లోని గౌరీ పరమేశ్వర కల్యాణ మండపంలో మంగళవారం పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లింగ్‌లో లోపాలు, విద్యుత్ తీగలు (కేబుల్), ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు లేదా కాలిపోయిన వాటి స్థానంలో కొత్తవి అమర్చడం, మీటర్లు కాలిపోవడం, విద్యుత్ ఓల్టేజ్ హెచ్చుతగ్గులు, మీటర్లలో లోపాలు, కొత్త సర్వీసులు, అదనపు లోడు మంజూరు, యజమాని పేరు, కేటగిరి, ఇతర మార్పిడి అంశాలు, వినియోగదారుల బిల్లుల్లో లోపాలు సరి చేయడం, బిల్లుల చెల్లింపు తర్వాత విద్యుత్ సరఫరా పునరుద్ధరణ తదితర అంశాలపై స్పందించనున్నట్లు చెప్పారు. విద్యుత్ సిబ్బంది సేవలు సక్రమంగా అందించకపోతే ఆ అంశాలను న్యాయస్థానం క్షుణ్ణంగా పరిశీలించి వినియోగదారులకు సత్వర న్యాయం చేస్తుందని పేర్కొన్నారు. వినియోగదారుని సమస్యలను నిర్దేశిత కాలంలో విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు పరిష్కరించకపోతే న్యాయస్థానం ఇరువురి వాదనలు విని, వినియోగదారునికి సమస్య పరిష్కారంతో పాటు సేవ అమలులో జాప్యానికి పరిహారం చెల్లించేలా తీర్పు ఇస్తుందన్నారు. అనంతరం వినియోగదారుల నుంచి పలు సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు షేక్ బాబర్, సులేఖ రాణి, స్వతంత్ర సభ్యుడు ఎస్.మురళీకృష్ణ, ఏపీఈపీడీసీఎల్ ఈఈ ధర్మరాజు, డిప్యూటీ ఈఈ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ప్రేమ వ్యామోహంలో పడొద్దు

అవగాహన సదస్సులో మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ పెంటారావు సూచన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ సీహెచ్.పెంటారావు
వేదికపై రిటైర్డ్ జడ్జి పైల సన్నిబాబు, ఇతర ప్రముఖులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణ కోసం మహిళలకు ఎన్నో మార్గాలు ఉన్నాయని, ప్రతి మహిళ చట్టాల గురించి తెలుసుకోవాలని మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ సీహెచ్ పెంటారావు సూచించారు. డాబాగార్డెన్స్ ఆదిత్య కళాశాల ఆవరణలో మహిళా పోలీస్ స్టేషన్, హిమ హ్యుమేనిటేరియన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు ప్రేమ వ్యామోహంలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. మంచి చదువులు చదివి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడితే, అప్పుడు మంచి వరుడు వస్తాడని హితవు పలికారు. సోషల్ మీడియాలో అపరిచితులను నమ్మవద్దన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ జడ్జి పైల సన్నిబాబు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో చదివిస్తున్నారని, వారి ఆశలను వమ్ము చేయవద్దని కోరారు. ప్రత్యేక అతిథిగా డివిజనల్ లెవల్ డెవలప్‌మెంట్ అధికారి ఇ.సందీప్, ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ కదారి కుమార్, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ భీశెట్టి వెంకటేశ్వరరావు, హిమ హ్యుమేనిటేరియన్ ఫౌండర్ టీవీడీ దాస్, బండారు రామారావు, టి.రాజేశ్వరి, రమ్య, వెంకటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల వార్షికోత్సవం



పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సీతమ్మధార, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో గల అంజనేయస్వామి, సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల 16వ వార్షికోత్సవ పూజలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు రామారావు శర్మ, పుర్ణిల మహేష్ శర్మలు అంజనేయస్వామి, బాల సుబ్రహ్మణ్య స్వామికి పాలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. దాతలు వాసుదేవ వర్మ, జ్యోతి దంపతులు పూజలు చేశారు. ఆలయ ఈఓ బండారు ప్రసాద్ పర్యవేక్షణలో వార్షికోత్సవ పూజలు నిర్వహించారు.

పార్వతీపరమేశ్వరుల ఊరేగింపు

సీతంపేట గణేష్‌నగర్‌లో గల పార్వతీశ్వరాలయం 35వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు భక్తులు సారె పట్టుకుని ఆలయానికి వెళ్లారు.

ఆసక్తికరంగా యూసీసీ టీ20 క్రికెట్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్స్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న యూసీసీ టీ20 క్రికెట్ చాంపియన్‌షిప్ టోర్నీ ఆసక్తికరంగా సాగుతోంది. తొలి మ్యాచ్‌లో గెలాక్సీ సీసీ నాలుగు వికెట్ల తేడాతో కంట్రీ సీసీపై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన కంట్రీ సీసీ నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 111 పరుగులు చేసింది. రంజీ ప్లేయర్ కె.వి.శశికాంత్ (31), కె.ప్రవీణ్ (20), కె.హరిష్ (24) మినహా మిగిలినవారు పెవిలియన్‌కు క్యూ కట్టారు. గెలాక్సీ సిసి బౌలర్లలో రవితేజ నాలుగు, కమిల్ మూడు వికెట్లు పడగొట్టి కంట్రీ సిసి బ్యాటింగ్‌ను దెబ్బతీశారు. సాధారణ లక్ష్యాన్ని గెలాక్సీ 17.2 ఓవర్లలో ఆరు వికెట్లు నష్టపోయి ఛేదించింది. కంట్రీ సిసి బౌలర్లు ఎక్స్‌ట్రాల రూపంలో 16 పరుగులు ఇవ్వడంతో గెలాక్సీ విజయం సునాయాసమైంది. కృష్ణకాంత్ రెండు వికెట్లు పడగొట్టాడు. మరో మ్యాచ్‌లో కవలియర్స్ సిసి 47 పరుగుల తేడాతో వైజాగ్ వెటరన్స్‌పై గెలుపొందింది. జింక్ గ్రౌండ్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో గాజువాక గ్రీన్స్ 106 పరుగుల భారీ తేడాతో సిటీ పోలీసుపై ఘనవిజయం సాధించింది. తొలి బ్యాటింగ్ చేసిన గాజువాక గ్రీన్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 189 పరుగులు చేసింది. ప్రసాద్ (44), మహీప్‌కుమార్ (43), సమన్విత్ (25) రాణించారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సేవలు అందేదెన్నడో?

... 5వ పేజీ తరువాయి

అవకాశం ఉంటుంది. ఆస్పత్రిలో 80 పడకలు అదనంగా రానున్నాయి. ఇందులో వృద్ధులకు 20, పిల్లలకు 20, వ్యసన విముక్తికి సంబంధించి మరో 40 పడకలతో ప్రత్యేకంగా వార్డులు ఉంటాయి. అందుకు అనుగుణంగా సిబ్బంది ఉంటారు. అలాగే, సైకియాట్రిక్ నర్సింగ్, క్లినికల్ సైకాలజీ, సైకియాట్రిక్ సోషల్ వర్క్ విభాగాలు అందుబాటులోకి వస్తాయి. ఒక్కో విభాగంలో 30 మందికి అడ్మిషన్లు ఇచ్చి మానసిక నిపుణులను తయారు చేయనున్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కోసం మూడు అంతస్థుల్లో సువిశాలమైన భవంతిని నిర్మించారు. ఇందులో అకడమిక్ బ్లాక్‌తోపాటు ఆయా కోర్సుల నిర్వహణకు అనుగుణంగా తరగతి గదులు, హాస్టళ్లు, మనో వికాస కేంద్రం ఏర్పాటు చేస్తారు. మరోచోట డీ అడిక్షన్ బ్లాక్‌ను ప్రత్యేకంగా నిర్మించారు.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ముందుకు

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అందుబాటులోకి వస్తే రోగులకు ఎంతో మేలు కలుగుతుంది. ఆ ఉద్దేశంతోనే ఆరోగ్య శాఖ మంత్రి కార్యాలయానికి విషయాన్ని తెలియజేశాం. వచ్చే నెలలో ప్రారంభించేలా ఏర్పాట్లు చేసుకుంటున్నాం. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళతాం. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వల్ల కొత్త విభాగాలు ఏర్పాటు కావడంతోపాటు మానసిక నిపుణులను తయారుచేసే ఇనిస్టిట్యూట్‌గా నిలుస్తుంది. అదే సమయంలో పలు పోస్టులు మంజూరవుతాయి. వివిధ కేడర్లకు సంబంధించి 120 వరకు కొత్త పోస్టులు మంజూరు అవుతాయి. మానసిక సమస్యలతో బాధపడే వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించే టాప్ ఇనిస్టిట్యూట్‌గా మారుతుంది.

– డాక్టర్ కేవీ రామిరెడ్డి, మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్

'అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా'



శివప్రసాదరావుకు సంఘీభావం తెలుపుతున్న బీఎస్పీ ప్రతినిధులు

సీతంపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయునిగా అంకితభావంతో ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దానని, ఆ క్రమంలో అధ్యాపక, ఉపాధ్యాయుల సమస్యలు తెలిసినవాడిగా పరిష్కారానికి కృషి చేస్తానని బహుజన సమాజ్ పార్టీ బలపరిచిన స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి పెదపెంకి శివప్రసాదరావు తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం బీఎస్పీ ఆధ్వర్యంలో శివప్రసాదరావు పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయనకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. బహుజన్ సమాజ్ పార్టీ జోనల్ కన్వీనర్ లకే రాజారావు, బీసీ సమన్వయ కమిటీ చైర్మన్ కట్టా మల్లేశ్వరరావు తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కట్టా మల్లేశ్వరరావు మాట్లాడుతూ శివప్రసాదరావు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయగలరని విశ్వాసం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ ప్రతినిధులు సర్వే సురేష్, భీమరశెట్టి విశ్వనాథం, దాసరి సూర్యనారాయణ, రమేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దుర్గాలమ్మ ఉత్సవాలు

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పూర్ణామార్కెట్ ఏరియాలో వెలసిన దుర్గాలమ్మ గుడి ఉత్సవాలకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం (నేటి) నుంచి 27 వరకు అమ్మవారి ఉత్సవాలు జరుగుతాయి. ఉదయం 10.15 గంటలకు వినాయకుడి రాట ముహూర్తంతో ఉత్సవాలకు ఆలయ అధికారులు శ్రీకారం చుడతారు. 20న నాగవల్లి దళార్చన (తమలపాకులతో అమ్మవారికి అలంకరణ), 21 శాకాంబరిగా పూజలు జరుపుతారు. 22న పుష్పాలంకరణ, 23న సౌభాగ్యలక్ష్మి (గాజులతో అలంకరణ)గా పూజిస్తారు. 24న దేవస్థానం ఆవరణలో దీపాలంకరణ, 25న తొలేళ్ల సంబరాలు, మహాశివరాత్రి పర్వదినం రోజున జాతర ఘనంగా నిర్వహిస్తారు. అదేరోజు శూలాల పండుగ, అగ్నిగుండం తొక్కడం, కుంకుమార్చనలు జరుపుతారు. శివరాత్రి రోజు అర్ధరాత్రి నేత్రోత్సవం అనంతరం తెల్లవారుజాము నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో శేఖర్‌బాబు తెలిపారు. ఆలయం వద్ద పోలీస్ బందోబస్తు ఉంటుందన్నారు.



ఉత్సవాలకు సిద్ధం చేస్తున్న దుర్గాలమ్మ గుడి

కోరినచోట బస్సు ఆపలేదని డ్రైవర్‌తో ప్రయాణికుడి గొడవ

ఇద్దరికీ సర్దిచెప్పి పంపిన పోలీసులు

మాధవధార, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సింహాచలం ఆర్టీసీ డిపోకి చెందిన 28 జెడ్/హెచ్ ఆర్టీసీ బస్‌లో మంగళవారం ప్రయాణికుడు, బస్సు డ్రైవర్ గొడవ పడటంతో బస్సు నేరుగా మాధవధారలోని ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీస్ స్టేషన్‌కి చేరింది. తాను చెప్పిన చోట బస్సు ఆపలేదని ప్రయాణికుడు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగాడు. మాటామాటా పెరిగి పరస్పరం చేయిచేసుకునే వరకు రావడంతో డ్రైవర్ సింహాచలం చేరే హైవే దారిలో ఆర్‌అండ్‌బీ జంక్షన్ దగ్గర ఉన్న ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీస్ స్టేషన్‌కు నేరుగా తీసుకొచ్చి ఆపాడు. ఇద్దరూ ఆవేశంగా స్టేషన్‌లోకి వెళ్లాక పోలీసు అధికారులు వివరాలు తెలుసుకుని ఇద్దరికీ సర్ది చెప్పి రాజీ కుదిర్చారు. ఈ తతంగంతో ప్రయాణికులు కొంత ఇబ్బంది పడ్డారు. మధ్యలో ప్రయాణికుల్ని హైవే ఆర్‌అండ్‌బీ జంక్షన్‌లో దించేయడంతో వారు ప్రత్యామ్నాయ రవాణాను ఆశ్రయించాల్సి వచ్చింది. దీనిపై విచారించిన సింహాచలం డిపో మేనేజరు రాజశేఖర్ ఇలాంటి సందర్భాల్లో డ్రైవర్ తన రక్షణ కోసం పోలీసుల్ని ఆశ్రయిస్తారని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేస్తామని అన్నారు. పోలీసుల సహకారానికి అభినందనలు తెలిపారు. ప్రయాణికులు కూడా ఆర్టీసీ ఉద్యోగుల పట్ల సంయమనంతో వ్యవహరించాలని, అదే సమయంలో ప్రజల పట్ల దురుసు ప్రవర్తన కనబరచిన ఆర్టీసీ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టంచేశారు.



ఎయిర్ పోర్ట్ జోన్ పోలీస్ స్టేషన్‌కి చేరిన ఆర్టీసీ బస్సు

అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డా.జె.చంద్రశేఖరరావు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్వాడీ కార్యకర్తలకు మంగళవారం నుంచి ఆరు రోజుల శిక్షణ ప్రారంభమైందని విశాఖపట్నం ఏపీసీ, ఎస్ఎస్ఏ డా.జె.చంద్రశేఖరరావు తెలిపారు. ప్రీ ప్రైమరీ 1, 2 తరగతులు బలోపేతం చేసే చర్యల్లో భాగంగా 776 మంది అంగన్వాడీ కార్యకర్తలకు మండల స్థాయిలో శిక్షణ ఇస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి 20 వరకు, 22, 24, 25 తేదీల్లో మండలస్థాయిలో ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలల్లో కార్యకర్తలకు శిక్షణ ఇస్తామన్నా రు. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ ప్రోగ్రామ్‌లో భాగంగా ఇప్పటికే 1వ తరగతి బోధించే 560 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వగా, ఇప్పుడు అంగన్వాడీ టీచర్లకు 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా తరగతులు బోధిస్తున్నామన్నారు. మండల స్థాయిలో ఎంఈఓలు కోర్సు డైరెక్టర్లుగా వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమాలను జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్షా, ఉప విద్యాశాఖ, మండల విద్యాశాఖ అధికారులు, ఐసీడీఎస్ పీడీలు పర్యవేక్షిస్తారన్నారు.

ఏయూ వీసీగా రాజశేఖర్

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుందంటున్నారు. విద్యా బోధనలో కీలక మార్పులు చేయడంతో పాటు పరిశోధనలకు పెద్దపీట వేసే ఆలోచనలో పాలకులు ఉన్నారు.

కీలక బాధ్యతలు

ప్రొఫెసర్ రాజశేఖర్ అనేక కీలక బాధ్యతలను నిర్వర్తించారు. గేట్-2014 ఆర్గనైజింగ్ చైర్మన్‌గా, 2014లో గేట్ అకడమిక్ స్టాండింగ్ కమిటీ కన్వీనర్‌గా, 2018-19లో ఐఐటీ ప్లేస్‌మెంట్ కమిటీ కన్వీనర్‌గా, 2020లో జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ సభ్యుడిగా బాధ్యతలను నిర్వ ర్తించారు. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్‌గా, ప్లానింగ్ అండ్ కో-ఆర్డినేషన్ విభాగం డీన్‌గా, కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ డీన్‌గా, టెక్నాలజీ విజన్-2047 వర్క్‌షాప్ చైర్మన్‌గా, ఐఐటీ ఖరగ్‌పూర్ విజన్-2030 డాక్యుమెంట్ కమిటీ చైర్మన్‌గా, కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ చైర్మన్‌గా సేవలు ఆయన అందించారు.

బయట నుంచి నియామకం ఇదే తొలిసారి..

ఆంధ్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్లుగా ఇప్పటివరకూ వర్సిటీకి చెందిన, రాష్ట్రంలోని ఇతర వర్సిటీల్లో పనిచేసిన వారినే నియమిస్తూ వచ్చారు. తొలిసారి ఐఐటీ ప్రొఫెసర్‌ను నియమించారు. ఇదిలావుంటే ఇన్‌చార్జి వీసీగా ఉన్న ప్రొఫెసర్ జి.శశిభూషణరావును రిలీవ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయన రిలీవ్ అయ్యారు. నూతన వీసీగా నియమితులైన ప్రొఫెసర్ రాజశేఖర్ వర్చువల్‌గా జాయినింగ్ ఆర్డర్స్ ఉన్నతాధికారులకు పంపిస్తారని, ప్రభుత్వ ఆదేశాలు వచ్చినప్పటి నుంచి ఆయన వీసీగా నియమితులైనట్టేనని ఏయూ అధికారులు చెబుతున్నారు. అధికారికంగా మంచి రోజు చూసుకుని వచ్చి బాధ్యతలు స్వీకరిస్తారంటున్నారు. గడిచిన ఐదేళ్లలో యూనివర్సిటీలో రాజకీయాలు బాగా పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో బయట నుంచి సీనియర్ ప్రొఫెసర్‌ను తీసుకు రావడం ద్వారా వాటన్నింటికీ చెక్ చెప్పడంతో పాటు వర్సిటీ పాలనను గాడిలో పెట్టవచ్చునని ప్రభుత్వం భావించినట్టు చెబుతున్నారు. ఏది ఏమైనా తాజా నిర్ణయంతో వర్సిటీ ప్రతిష్ఠ ఇనుమడిస్తుందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. రాజకీయాలకు, వ్యక్తిగత అజెండాలకు దూరంగా వర్సిటీ పాలన సాగేందుకు అవకాశం ఉంటుం దని విశ్లేషిస్తున్నారు.

రాజశేఖర్ నియామకంపై సింహాచలం వాసుల హర్షం



రాజశేఖర్‌ను సన్మానిస్తున్న స్థానికులు(ఫైల్‌ఫొటో)

సింహాచలం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే పేరొందిన ఆంధ్ర విశ్వవిద్యాలయానికి తమ ప్రాంతవాసి ఉప కులపతిగా నియామకం కావడం పట్ల సింహాచలం వాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. వీసీగా నియమితులైన జీపీ రాజశేఖర్ తండ్రి బలరామకృష్ణ స్వస్థలం ఏ.కోడూరు. అయితే ల్యాబ్ టెక్నీషియన్‌గా సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో చేరిన ఆయన పదవీ విరమణ చేసేంత వరకూ స్థానికంగానే నివాసం ఉన్నారు. బలరామకృష్ణ, సావిత్రి దంపతులకు ఇద్దరు కుమారులు (రాజశేఖర్, గిరిధర్), ఒక కుమార్తె (సునీత). రాజశేఖర్ ఒకటి నుంచి ఏడో తరగతి వరకూ సింహాచలం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుకున్నారు. ఆ తరువాత సెయింట్ ఆంథోనీ, ఏవీఎన్ కళాశాల, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలలో విద్యాభ్యాసం చేశారు. ప్రస్తుతం ఖరగ్‌పూర్‌లోని ఐఐటీలో గణితశాస్త్ర ఆచార్యునిగా పనిచేస్తున్నారు. గతంలో అడివివరం శాఖా గ్రంథాలయ వారోత్సవాలలో ఆయన్ను స్థానికులు ఘనంగా సత్కరించారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఏయూ వీసీగా నియమించటం పట్ల ఆయనతో కలిసి చదువుకున్న మిత్రులు పాశర్ల ప్రసాద్, రాజనాల సత్యారావు, ఎర్ర దేవీ వరప్రసాద్‌లతో పాటు వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, మజ్జి సూరిబాబు, రచ్చా ఆనంద శ్రీనివాసవర్మ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరణ

... 5వ పేజీ తరువాయి

తెలిపారు. 07025 నంబరు గల రైలు ఈ నెల 21వ తేదీ రాత్రి 9.15 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07026 నంబరు గల రైలు ఈ నెల 22న మధ్యాహ్నం 2.15 గంటలకు శ్రీకాకుళం రోడ్డులో బయలుదేరి సాయంత్రం 4.45 గంటలకు దువ్వాడ, మరుసటిరోజు ఉదయం 6 గంటలకు చర్లపల్లి చేరుతుంది. ఈ రైళ్లు నల్లగొండ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, అన్నవరం మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

పలు రైళ్లు రద్దు: నిర్వహణ పనుల దృష్ట్యా విశాఖ నుంచి షాలిమార్ వెళ్లే 22854 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలును బుధవారం (19న) రద్దు చేశారు. ఈ నెల 21న సంత్రాగచ్చి-ఎంజీఆర్ చెన్నై ఎక్స్‌ప్రెస్ (22807), 23న ఎంజీఆర్ చెన్నై-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ (22808)ను రద్దు చేశామని రైల్వే అధికారులు తెలిపారు.

డేంజర్ జోన్

... 5వ పేజీ తరువాయి

చిల్డ్రన్ పార్కులోకి దూసుకుపోయింది. శ్రీకాకుళం నుంచి ఇసుకలోడుతో వచ్చిన లారీ పందిమెట్ట జంక్షన్ నుంచి ఫిషింగ్ హార్బర్‌కు వెళ్లే క్రమంలో నోవాటెల్ డౌన్ దిగుతుండగా అదుపుతప్పడంతో నేరుగా బీచ్‌రోడ్డు రక్షణగోడను ఢీకొంది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అయితే లారీ అమిత వేగంతో గోడను ఢీకొట్టడంతో రాళ్లు గాల్లోకి ఎగిరిపడడంతో సమీపంలో వాకింగ్ చేస్తున్న వన్‌టౌన్‌లోని దిగువ రెల్లివీధికి చెందిన తుపాకుల వెంకట రవికుమార్ తలకు గాయమైంది. అతడ్ని కేజీహెచ్‌కు తరలించారు. లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. అక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయనే రక్షణ గోడపై కూర్చునే సందర్శకులకు, రక్షణ గోడ వెనుక గల రోడ్డులో నడిచేవారికి, దాని వెనుక భాగంలో తీరానికి ఆనుకుని ఉన్న చిల్డ్రన్‌పార్కులో ఉన్నవారికి ఎలాంటి నష్టం జరగకుండా నోవాటెల్ డౌన్‌కు ఎదురుగా బీచ్‌రోడ్డులో ప్లాస్టిక్ బ్లాక్‌లను ఏర్పాటుచేశారు. కానీ ఇసుక లారీ అమిత వేగంతో దూసుకురావడంతో ఆ బ్లాక్స్ చెల్లాచెదురైపోయాయి. లారీ రక్షణ గోడను, దాని వెనుకవున్న రోడ్డును దాటి తీరం వైపు ఉన్న చిల్డ్రన్ పార్కు లోపలకు దూసుకుపోయింది. ఆ వేగానికిపార్కు ప్రహరీ గోడ కూడా ధ్వంసమైంది. లారీ ముందుభాగం కూడా పూర్తిగా దెబ్బతింది. లారీ అపరిమిత వేగంతో రావడం చూసి బీచ్‌రోడ్డులో హార్బర్ వైపు వెళుతున్న కారును డ్రైవర్ ఆపేశారు. అలాకాకుండా లారీ వచ్చేలోపు వెళ్లిపోవచ్చునని ముందుకు వెళ్లినట్టయితే కారు నుజ్జయ్యేదని సీసీ ఫుటేజీని చూసినవారంతా అభిప్రాయపడుతున్నారు.

66 చోరీ కేసుల్లో 74 మంది అరెస్టు

... 5వ పేజీ తరువాయి

ఆటోలు, నాలుగు ల్యాప్‌టాప్‌లు, రెండు టీవీలు, 313 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నగరంలో నేరాలను నియంత్రించేందుకు శివారు ప్రాంతాల్లో వీధి దీపాల ఏర్పాటు, తుప్పల తొలగింపు, సీసీ కెమెరాల ఏర్పాటు, రాత్రి క్రైమ్ బీట్‌ల పెంపు వంటివి చేస్తున్నామన్నారు. పాతనేరస్థుల కదలికలపై నిఘా ఉంచామన్నారు. చోరీ కేసుల్లో రికవరీని ప్రతి నెలా మెరుగుపరుచుకుంటూ వెళుతున్నామని సీపీ వివరించారు. ఐపీఎల్ సీజన్ ప్రారంభం కాబోతుండడంతో బెట్టింగ్ నియంత్రణపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేస్తామని కమిషనర్ బాగ్చీ అన్నారు. బెట్టింగ్ కేసుల్లో ఇప్పటికే 12 మందిని అరెస్టు చేశామని, మరికొందరిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. బెట్టింగ్‌కు పాల్పడేవారు, నిర్వహించేవారు ఎంతటి వారైనప్పటికీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని సీపీ స్పష్టంచేశారు. అలాగే నగరంలో రాత్రిపూట బైక్ రేసింగ్‌లు జరుగుతున్నట్టు తనకు ఫిర్యాదులు అందుతున్నాయని, వాటికి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల స్వయంగా తానే అర్ధరాత్రి దాటాక నగరంలో పరిస్థితిని పరిశీలించేందుకు తిరుగుతుండగా తెలుగుతల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద కొందరు యువకులు బైక్ రేసింగ్‌కు పాల్పడుతున్నట్టు గుర్తించానన్నారు. వారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. సమావేశంలో క్రైమ్ డీసీపీ లతామాధురి, ఏడీసీపీ మోహనరావు పాల్గొన్నారు.

బల్క్ వినియోగదారులకు తాగునీటికి అంతరాయం రేపు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాపురం హెడ్ వాటర్ పంపు హౌస్ నుంచి వచ్చే ప్రధాన తాటిపూడి పైపులైకు గోపాలపట్నం వద్ద మరమ్మతు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ పరిధిలోని గోపాలపట్నం నుంచి కంచరపాలెం మధ్య ఉన్న బల్క్ ఇండస్ట్రీ వినియోగదారులకు ఈ నెల 20న తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు బి.మురళీకృష్ణ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణాపురం హెడ్ వాటర్ పంప్‌హౌస్ నుంచి వచ్చే తాటిపూడి ప్రధాన పైపులైను గోపాలపట్నం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద మరమ్మతులకు గురైనందున బుధవారం ఉదయం 10 గంటల నుంచి గురువారం ఉదయం 10 గంటల వరకు మంచినీటి సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

బైక్ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

తగరపువలస, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సంగివలస మూడు గుళ్ళ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొనడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించి భీమిలి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఈనెల 15న నెల్లూరుకు చెందిన గన్నపనేని ఉమాదేవి (45), ఆమె కుమారుడు సురేష్ విజయనగరం జిల్లా మెంటాడ సమీపంలోని తాటిపూడివలస గ్రామానికి తన పెద్దకుమారుడి పెళ్లి చూపులకు వచ్చారు. వీరు తిరుగుప్రయాణంలో ట్రావెల్ బస్సు బుక్ చేసుకున్నారు. దీనికి సంగివలస మూడుగుళ్ల అమ్మవారి ఆలయం వద్ద ఈ నెల 15న సాయంత్రం బస్సు కోసం నిరీక్షిస్తున్నారు. ఈలోగా అమ్మవారిని దర్శించుకుంటానని తన చిన్నకుమారుడు సురేష్‌కు చెప్పి తల్లి వెళ్లింది. దర్శనం చేసుకుని తిరిగి వెనక్కి రావడానికి రోడ్డు దాటుతుండగా, విజయనగరం వైపు నుంచి వెళుతున్నబైక్ ఆమెను ఢీకొంది. దీంతో ఆమె కుడి చేయి విరిగిపోయింది. ఆమెను నగరంలో ఆస్పత్రిలో జాయిన్ చేశారు. కాగా, ఈ విషయమై మంగళవారం బాధితురాలి కుమారుడు సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సుధాకర్ తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

ఎంవీపీ స్టేషన్ పరిధిలో బాలిక అదృశ్యం కేసు నమోదైంది. పెదజాలారిపేటకు చెందినబాలిక ఎంవీపీ కాలనీలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో సీఐ మురళీ పర్యవేక్షణలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

● **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం),
● **తండేల్:** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ(గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
● **మదగజరాజ:** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం),
● **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడీ, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్:** శరత్, శ్రీకన్య కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్:** మెలోడీ, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 37, టమాటా 11, వంకాయలు (తెలుపు)14, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 42, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 34, బీరకాయలు 60, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 12, క్యారెట్ 30 దొండకాయలు 30, బంగాళ దుంపలు 14, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)48, బరబాటి 28, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 120, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 36, కీరదోస 30, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 32 చిలగడదుంపలు 30, కంద 64, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్ కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

పార్కులో వేడుకలు.. చోద్యం చూస్తున్న అధికారులు

- వేడుకలకు అడ్డాగా చిన్నవాల్తేరు కాలనీ పార్కు
- స్థానికులకు ఆహ్లాదం కరువు
- పట్టించుకోని జీవీఎంసీ అధికార యంత్రాంగం



ప్రైవేటు వేడుక కోసం ముస్తాబైన పార్కు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 21వ వార్డు చినవాల్తేరు కాలనీ జీవీఎంసీ పార్కును అధికారులు కల్యాణ మండపంగా మార్చేశారు. పార్కులోనే వేడుకలు నిర్వహించేందుకు అవకాశం కల్పిస్తుండడంతో స్థానికులకు ఆహ్లాదం కరువవుతోంది. ఎవరైనా ఇలాంటి కార్యక్రమాలు చేపడితే చర్యలు తీసుకోవాల్సి జీవీఎంసీ అధికారులు చోద్యం చూస్తున్నారు.

జీవీఎంసీ చినవాల్తేరు కాలనీ అసోసియేషన్ నిర్వాహకులు పీపీపీ పద్ధతి ద్వారా కాలనీ పార్కును ఏర్పాటు చేశారు. స్మార్ట్ నిధులతో ఈ పార్కును మరింత అభివృద్ధి చేపట్టారు. చిన్నారుల ఆహ్లాదానికి పచ్చిక బయళ్లు, ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. అయితే పార్కులో వేడుకలు నిర్వహణకు చినవాల్తేరు కాలనీకి చెందిన వేడుకలకు సామగ్రి సప్లయ్ చేసే ఓ వ్యక్తితో పార్కు నిర్వాహకులు బేరం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో తన వద్దకు సప్లయర్స్ బుకింగ్ చేయడానికి వచ్చే వినియోదారులకు సదరు వ్యాపారి పార్కు చూపించి అక్కడే వేడుకలు జరుపుకోవడానికి ఒప్పిస్తున్నారు. ఒక్కో వేడుకకు స్థలానికి రూ.15 వేలు, తాను సప్లయ్ చేసే సామగ్రికి రూ.20 వేలు వరకూ వసూలు చేస్తున్నట్టు సమాచారం.

గత కొద్దిగా నెలలుగా పార్కులో టెంట్లు, డెకరేషన్స్ వేయడమే కాకుండా వేడుకల కోసం వంటలు కూడా పార్కులోనే చేయడంతో పచ్చిక బయళ్లు పాడైపోయాయి. ఇది పెళ్ళిళ్ల సీజన్ కావడంతో వారానికి రెండు, మూడు ఫంక్షన్లు పార్కులో ఏర్పాటు చేస్తున్నారు. అంతేనా.. వేడుకలు ముగియగానే సప్లయర్స్ వ్యాపారి సామగ్రిని క్లీన్ చేసి పార్కులోనే భద్రపరుస్తున్నారు. దీనివల్ల పరాధీనమైంది. సెలవు రోజుల్లో పిల్లలు ఆటలాడుకోవడానికి కుదరడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ జోన్-3 కమిషనర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. ఈ విషయమై జోన్-3 కమిషనర్‌ను అడగ్గా.. ఇది తన దృష్టికి వచ్చిందని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రతి విద్యార్థి ఆఫర్ లెటర్ సాధించాలి

- ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు



విద్యార్థులకు సూచలిస్తున్న ప్రొఫెసర్ నరసింహారావు

వెంకోజీపాలెం,ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పీజీ పరీక్షలు పూర్తయ్యేనాటికి ప్రతి విద్యార్థి ఆఫర్ లెటర్ చేత్తో పట్టుకువెళ్లాలని ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు అన్నారు.మంగళవారం ఏయూ పేస్‌మెంట్ అధికారి వైవీ రెడ్డితో కలిసి ఫైనల్ ఇయర్ విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ అభిరుచికి తగిన రంగాన్ని ఎంపిక చేసుకుని, అందుకు తగిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఇందుకు తగిన అన్ని ఏర్పాట్లు విశ్వవిద్యాలయం చేసిందన్నారు. ప్లేస్‌మెంట్ డైరెక్టర్ వైవీ రెడ్డి మాట్లాడుతూ నిరంతరం విద్యార్థులను ఉద్యోగులుగా మార్చే పనిలో ఉన్నామని, వివిధ సంస్థలతో సంప్రదింపులు నిర్వహిస్తున్నామన్నారు. అందరూ వివిధ సంస్థల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జర్నలిజం విభాగం ప్లేస్‌మెంట్ ట్రైనర్ డాక్టర్ జీకేడీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సింహగిరిపై దళారుల హవా

- పెళ్లి ఏర్పాట్లు చేస్తానంటూ పలాయనం
- దేవస్థానం అధికారులకు బాధితుడి ఫిర్యాదు

సింహాచలం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి సాక్షిగా సింహగిరిపై వివాహాలు చేసుకునే వారిని కొందరు దళారుల మోసగిస్తున్నారు. ఇందుకు సంబందించి ఒక వీడియో తాజాగా సోషల్ మీడియాలో మంగళవారం సాయంత్రం నుంచి వైరల్ అవుతోంది. అందులో ఉన్న సమాచారం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన వ్యక్తి ఒకరు తన మేనల్లుడిని పెళ్లి నిర్వహించేందుకు సింహగిరికి చేరుకున్నారు. అతడి వద్దకు దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రకటనలకు విరుద్ధంగా శ్రావణ్‌కుమార్ అనే వ్యక్తి వచ్చి పెళ్లి తంతు మొత్తం తనే చూసుకుంటానంటూ బేరం కుదుర్చుకున్నాడు. సదరు వ్యక్తి రెండు గదులు, వెయిటింగ్ హాలు, రెండు పెళ్లి పీటలు, మేళం, కళాకారులకు ఏర్పాటు చేస్తానమంటూ మొత్తంగా రూ.52 వేలు ఫోన్ పే ద్వారా వసూలు చేశాడు. ఆ తర్వాత మొహం చాటేశాడు. దీంతో మేనల్లుడికి పెళ్లి చేస్తానంటూవచ్చిన వ్యక్తి ఇబ్బందులకు గురయ్యారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని పెళ్లి జరిపించుకున్నారు. అయితే సింహగిరిపై ఇలాంటి దళారుల నుంచి సామాన్యులను కాపాడాలని దేవస్థానం అధికారులను ఆయన కోరారు.

ప్రజలు తిప్పికొట్టినా మారని జగన్ తీరు

ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజలు ముఖం ఎత్తుకోలేని విధంగా తీర్పు ఇచ్చినా ఇంకా బుద్ధి రాలేదని ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు విమర్శించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే వంశీని చూడటానికి విజయవాడ వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను బెదిరిస్తూ మాట్లాడారని, అతడి పద్ధతి ఇంకా మారలేదన్నారు. తప్పుచేసిన వారిపై అధికారులు చట్టప్రకారం చర్యలు చేపడితే, వారిని గుర్తు పెట్టుకొని మరీ వేధిస్తామని హెచ్చరించడం దారుణమన్నారు. ప్రజలు ఎందుకు తిరస్కరించారో జగన్ ఇప్పటికైనా అర్థం చేసుకోవాలని హితవు పలికారు. సీఎంగా బాధ్యతలు నెరవేర్చిన నాయకుడు ఇలామాట్లాడడం సబబు కాదన్నారు.

మండల కేంద్రాల్లో అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ



మాట్లాడుతున్న డా.జె.చంద్రశేఖరరావు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్వాడీ కార్యకర్తలకు మంగళవారం నుంచి ఆరు రోజుల శిక్షణ ప్రారంభమైందని విశాఖపట్నం ఏపీసీ, ఎస్ఎస్ఏ డా. జె.చంద్రశేఖరరావు తెలిపారు. ప్రీ ప్రైమరీ 1, 2 తరగతులు బలోపేతం చేసే చర్యల్లో భాగంగా 776 మంది అంగన్వాడీ కార్యకర్తలకు మండల స్థాయిలో శిక్షణ ఇస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి 20 వరకు, 22, 24, 25 తేదీల్లో మండలస్థాయిలో ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలల్లో కార్యకర్తలకు శిక్షణ ఇస్తామన్నారు. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ ప్రోగ్రామ్‌లో భాగంగా ఇప్పటికే 1వ తరగతి బోధించే 560 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వగా, ఇప్పుడు అంగన్వాడీ టీచర్లకు 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా తరగతులు బోధిస్తున్నామన్నారు. మండల స్థాయిలో ఎంఈఓలు కోర్సు డైరెక్టర్లుగా వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమాలను జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్షా, ఉప విద్యాశాఖ, మండల విద్యాశాఖ అధికారులు, ఐసీడీఎస్ పీడీలు పర్యవేక్షిస్తారన్నారు.

ఆసక్తికరంగా యూసీసీ టీ20 క్రికెట్ టోర్నీ



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన రవితేజ

విశాఖపట్నం స్పోర్ట్స్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న యూసీసీ టీ20 క్రికెట్ చాంపియన్‌షిప్ టోర్నీలో ఉదయం జరిగిన తొలి మ్యాచ్‌లో గెలాక్సీ సీసీ నాలుగు వికెట్ల తేడాతో కంట్రీ సీసీపై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన కంట్రీ సీసీనిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 111 పరుగులు చేసింది. రంజీ ప్లేయర్ కె.వి.శశికాంత్ (31), కె.ప్రవీణ్ (20), కె.హరిష్ (24) మినహా మిగిలినవారు పెవిలియన్‌కు క్యూ కట్టారు. గెలాక్సీ సిసి బౌలర్లలో రవితేజ నాలుగు, కమిల్ మూడు వికెట్లు పడగొట్టి కంట్రీ సిసి బ్యాటింగ్‌ను దెబ్బతీశారు. సాధారణ లక్ష్యాన్ని గెలాక్సీ 17.2 ఓవర్లలో ఆరు వికెట్లు నష్టపోయి ఛేదించింది. హేమంత్‌రెడ్డి (22), అరుణ్ (17), పాండురంగరాజు (16 నాటౌట్) రాణించారు. కంట్రీ సిసి బౌలర్లు ఎక్స్‌ట్రాల రూపంలో 16 పరుగులు ఇవ్వడంతో గెలాక్సీ విజయం సునాయాసమైంది. కృష్ణకాంత్ రెండు వికెట్లు పడగొట్టాడు. మరో మ్యాచ్‌లో కవలియర్స్ సిసి 47 పరుగుల తేడాతో వైజాగ్ వెటరన్స్‌పై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన కవలియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లకు 210 పరుగులు చేసింది. మునిష్ వర్మ అజేయ అర్ధ సెంచరీ (77 నాటౌట్), చంద్రమౌళి (42), కెఎస్ఎన్.రాజు (41) రాణించారు. లక్ష్యఛేదనలో వైజాగ్ వెటరన్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 163 పరుగులు చేయడంతో ఓటమి తప్పలేదు.

టాప్ ఆర్డర్ ఈశ్వర్ రిత్విక్ (20), రఫూస్ (21), అఖిల్ (28), సాయి వెంకటేష్ (35) రాణించినా ఫలితం లేకుండా పోయింది. జింక్ గ్రౌండ్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో గాజువాక గ్రీన్స్ 106 పరుగుల భారీ తేడాతో సిటీ పోలీసుపై ఘనవిజయం సాధించింది. తొలి బ్యాటింగ్ చేసిన గాజువాక గ్రీన్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 189 పరుగులు చేసింది. ప్రసాద్ (44), మహీప్‌కుమార్ (43), సమన్విత్ (25) రాణించారు.

సిటి పోలీసు బౌలర్ శివ కేశవ మూడు వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సిటి పోలీసు 15.3 ఓవర్లలో 83 పరుగులకు కుప్పకూలి భారీ తేడాతో ఓటమి చెందింది. ఎస్.శ్రీకాంత్ (27) మినహా మిగిలిన వారు రాణించలేకపోయారు. గెలాక్సీ బౌలర్లలో వంశీకృష్ణ మూడు వికెట్లు పడగొట్టగా, సమన్విత్, సిద్దార్థ చెరో రెండు వికెట్లు తీశారు.

మరో మ్యాచ్‌లో విజయనగరం క్రికెట్ సంఘం 40 పరుగుల తేడాతో ఎలమంచిలి సిసిపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన విజయనగరం నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 189 పరుగులు చేసింది. హరిష్ (50), వై.వాసు (52) హాఫ్ సెంచరీలు చేయగా, ఓపెనర్ సందీప్ (33) రాణించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎలమంచిలి సిసి 18.5 ఓవర్లలో 149 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది.

సర్కారు స్థలానికి ఎసరు?

- ఎఫ్‌సీఐ గోదాం ప్రహరీ వెనుక చదును చేసిన వైనం
- నీరు నిలువలేకుండా తూము ఏర్పాటు
- రెవెన్యూ అధికారులు స్పందించాలంటున్న స్థానికులు



చినముషిడివాడలో ఎఫ్‌సీఐ గోదాం ప్రహరీ వెనుక చదును చేసిన ప్రభుత్వ స్థలం

పెందుర్తి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయడంలో అక్రమార్కులు రోజుకో విధంగా వ్యవహరిస్తున్నారు. ఖాళీ స్థలం కనపడితే చాలు.. పక్కా ప్లాన్‌తో దానిని హస్తగతం చేసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. తాజాగా గ్రేటర్ 97వ వార్డు చినముషిడివాడలోని ఎఫ్‌సీఐ గౌడౌన్స్ ప్రహరీ వెనుక సర్వే నంబరు 44లో 1.4 ఎకరా ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసే యత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడి స్థలం ఎఫ్‌సీఐ గోదాములకు ఆనుకుని ఉండడం ఆక్రమణదారులకు కలిసివచ్చిందంటున్నారు. పూర్వం చినముషిడివాడ కోమటి చెరువు నుంచి గెడ్డ ద్వారా ప్రవహించే నీరు ఇక్కడి ప్రభుత్వ స్థలానికి చేరేది. ఇక్కడ ఊట మాదిరిగా ఏర్పటి రోజులతరబడి నిలిచిపోయి ఉండేది. అయితే కాలక్రమంలో ఈ స్థలం రస్తాగా మారింది. సమీప భూముల్లో లేఅవుట్‌లు వెలియడం, ఇళ్ల నిర్మాణాలు చేపడుతుండడంతో ఇక్కడ భూమి విలువ రూ.కోట్లకు చేరింది. ఈ క్రమంలో రస్తాగా మారిన స్థలాన్ని చేజిక్కించుకునేందుకు అక్రమార్కులు పక్కా స్కెచ్ వేశారు. ముందుగా గ్రావెల్, డెబ్రిస్‌ను డంప్ చేసి స్థలాన్ని చదునుచేశారు. అంతేకాకుండా ఈ స్థలం లో నీరు నిలిచిపోయి, లోతట్టు ప్రాంతాలు జలమయం కాకూడదనే చదును చేస్తున్నామని స్థానికులకు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నీరు దిగువకు వెళ్లిపోయేలా గొట్టాలను కూడా అమర్చారు. అయితే ప్రభుత్వ స్థలాన్ని చేజిక్కించుకునే ప్రయత్నంలో భాగంగానే ఇదంతా జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ స్థలం సమీపంలో ప్రైవేటు లేఅవుట్ ఉండడంతో గజం స్థలం రూ.20 వేలకు పైగానే ధర పలుకుతోంది. చదును చేసిన స్థలాన్ని ప్లాట్లుగా విభజించి, గుట్టుచప్పుడు కాకుండా విక్రయించేందుకు అక్రమార్కులు రంగం సిద్ధం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆ దిశగా రాజకీయ పలుకుబడితో పావులు కదుపుతున్నారంటున్నారు. ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించేలా రెవెన్యూ అధికారులు మేల్కొనకుంటే రూ.కోట్ల విలువైన స్థలం పరాధీనమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

స్థలాన్ని సర్వే చేస్తాం

చినముషిడివాడ ఎఫ్‌సీఐ గోదాం సమీపం లో గల ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించేలా చర్యలు తీసుకుంటాం. ఆ స్థలానికి సర్వే చేసి, హద్దులు నిర్ణయిస్తాం. శాఖాపరమైన విచారణ చేపట్టి స్థలాన్ని ల్యాండ్‌బ్యాంకులో నమోదు చేస్తాం. ఎవరైనా ఆక్రమణకు యత్నిస్తే కేసులు నమోదు చేస్తాం.

- ఆనంద్‌కుమార్, తహసీల్దార్, పెందుర్తి



విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ వెంకటశేషమ్మ

యువత చెడు వ్యసనాలకు దూరంగా మెలగాలి

- జిల్లా లీగ్ సెల్ అథారిటీ కార్యదర్శి, సివిల్ జడ్జి వెంకటశేషమ్మ

ఆరిలోవ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : యువత పెడదారి పట్టి వివాదాల్లో చిక్కుకొని కేసుల పాలవవద్దని జిల్లా లీగ్ సెల్ అథారిటీ కార్యదర్శి, సివిల్ జడ్జి వెంకటశేషమ్మ హితవు పలికారు. మంగళవారం తోటగరువు ఎన్ని దుర్గామాంబ ఫంక్షన్‌హాలులో ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వెంకటశేషమ్మ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు గురికావద్దన్నారు. విజయం అనేది కష్టపడితేనే వస్తుందని గ్రహించాలన్నారు. సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆశ, ఆడంబర జీవితానికి అలవాటు పడడం, అత్యాశ వంటి దుర్గుణాలకు దూరంగా ఉండన్నారు. మత్తు పదార్థాలకు బానిస అయితే జీవితం చిత్తవుతుందన్నారు. మహిళల పట్ల గౌరవ భావం ప్రదర్శించాలన్నారు. అయితే కొంతమంది యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ఇలాంటి వారి చట్టాలపై అవగాహన కల్పించడం ద్వారా వారిని ధోరణిని మార్చవచ్చన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కీలకంగా వ్యవహరించాలన్నారు. పోక్సో చట్టం గురించి వివరించారు. పోర్న్ వీడియోలను చూడడం కూడా నేరం అన్నారు. యువత కేవలం చదువుపై మాత్రమే దృష్టి సారించాలన్నారు. ఇటువంటి న్యాయ సదస్సులు ఏర్పాటు చేయడం ద్వారా యువతకు అప్రమత్తం చేసే అవకాశం ఉంటుందన్నారు. ఏడీసీపీ వీబీ రాజ్‌కుమార్ మాట్లాడుతూ కుటుంబం, సమాజం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అప్పుడే చెడు వ్యసనాలకు లోను కాకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఒమ్మి పోలారావు, బుడుమూరు గోవింద్,గాడి సత్యం, ధర్మారావు, యల్లమల్లి సురేష్, తెలుగు మహిళా 13వ వార్డు అధ్యక్షురాలు మజ్జి రమణి, అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు.

ఏయూ జియోఫిజిక్స్ విభాగం ప్లాటినం జూబ్లీ వేడుకలు



వేడుకలను ప్రారంభిస్తున్న విభాగాధిపతి ఏయూ సైన్స్ కాలేజ్ ఎంవీఆర్ రాజు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఏయూ జియో ఫిజిక్స్ విభాగం ప్లాటినం జూబ్లీ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని ఏయూ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా విభాగం ఆవరణలో జియోఫిజిక్స్, వాతావరణ శాస్త్రం, సముద్ర శాస్త్రం విభాగం, ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు, ఇండియా మెటిరోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా, సోలార్స్, ఈసీఈ విభాగం, పర్యావరణం శాస్త్రం నుంచి వివిధ స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రదర్శన నిర్వహించారు. సమాజ ప్రయోజనం కోసం ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన బుధవారం కూడా కొనసాగనుందని నిర్వాహకులు తెలిపారు.


రైతు బజార్‌లో ఆకస్మిక తనిఖీ



రైతుబజార్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ బృందం

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 18 : ఎంవీపీ రైతు బజార్‌ను మార్కెటింగ్ శాఖ విజిలెన్స్ బృందం మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసింది. జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్, మార్కెట్ కమిటీ సెక్రటరీ, డెప్యూటీ డైరెక్టర్ పాపారావు, కార్యదర్శి అరుణ ఈ బృందంలో ఉన్నారు. బజార్‌లోని ప్రతి స్టాల్‌ను తనిఖీ చేశారు. రైతులు పండించిన పంటలను నేరుగా రైతు బజార్‌కే తేవాలని రైతులకు సూచించారు. రైతు పొలం వద్ద అమ్మితే ఎంత ధర పలుకుతుంది.. ఇక్కడకు తీసుకవస్తే వచ్చే లభించే ధరలను అడిగి తెలుసుకున్నారు. స్టాల్స్ అద్దె చెల్లింపుల తీరును పరిశీలించారు. ఎస్టేట్ అధికారి వరహాలు, సహాయకుడు కనకరాజు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కూలి మృతి



ఆదినారాయణ (ఫైల్)

భీమునిపట్నం రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కాలువలో పడి నాలుగు రోజుల కిందట తలకు గాయమైన రాజుల తాళ్లవలసకు చెందిన ఒనుము ఆదినారాయణ (38) మంగళవారం మృతి చెందాడు. భీమిలి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. ఈ నెల 15న సాయంత్రం కూలిపనులు ముగించుకుని తాళ్లవలస దరి చిట్టీల అగ్రహారంలో ఇంటికి వెళుతున్న ఆదినారాయణ అలసట రావడంతో మార్గంమధ్యలో కాలువ గట్టుపై కూర్చున్నాడు. అదే సమయంలో అతడికి ఫిట్స్ రావడంతో కాలువలో పడిపోయాడు. దీంతో తలకు తీవ్రగాయమైంది. కుటుంబ సభ్యులు సంగివలస ఏఎన్‌హెచ్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో కింగ్ జార్జి ఆస్పత్రికి తరలించారు. అక్కడ నాలుగు రోజులు మృత్యువుతో పోరాడిన ఆదినారాయణ మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో మృతి చెందాడు. మృతుడికి భార్య కొండమ్మ, ఇంటర్మీడియట్ చదువుతున్న కుమారుడు కార్తీక్ ఉన్నాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సుధాకర్ తెలిపారు.

జైళ్లశాఖ అధికారులపై ప్రభుత్వం చర్యలు

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం సెంట్రల్ జైలులో జరిగిన వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసింది. మరో 16మందికి చార్జ్ మెమోలు జారీ చేసి సంజాయిషీ అడిగింది. వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన విశాఖ కేంద్ర కారాగారంలో సెల్‌ఫోన్లు గుర్తించడం, జైలు లోపలికి గంజాయి సరఫరా వంటి ఘటనల నేపథ్యంలో జైళ్లశాఖ అధికారులపై సిబ్బంది గత డిసెంబరులో ఆందోళనలకు దిగిన విషయం తెలిసిందే. దీనిపై హోంశాఖ మంత్రి అనిత జైలును సందర్శించి బాధ్యులపై చర్యలు చేపడతామంటూ ఉన్నతాధికారులతో విచారణ చేయించారు. నివేదిక వచ్చిన తర్వాత జైలు సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాస్ పనితీరులో లోపం ఉన్నట్లు తేల్చి ఆయనతో పాటు మరో సూపరింటెండెంట్ జవహర్‌బాబును సస్పెండ్ చేస్తూ తాజాగా ప్రభుత్వం జీవో విడుదల చేసింది. విశాఖ జైలు మరో సూపరింటెండెంట్ ఎస్.కిశోర్ కుమార్, అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వర్లుపైనా చర్యలు తీసుకుంది.

భెల్‌కు ఈఈపీసీ క్వాలిటీ అవార్డు



కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద్ నుంచి అవార్డు అందుకుంటున్న భెల్ డైరెక్టర్ బని వర్మ

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉత్పత్తి సాధనలో నాణ్యతా ప్రమాణాలు పాటించే ప్రభుత్వ రంగ పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్ఠాత్మక ఫోర్త్ ఎడిషన్ ఈఈపీసీ క్వాలిటీ అవార్డును ఈ ఏడాది భెల్ పరిశ్రమ దక్కించుకుంది. న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర సహాయ పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి జితిన్ ప్రసాద్ చేతుల మీదుగా భెల్ డైరెక్టర్(ఇ-ఆర్అండ్‌డీ) బని వర్మ అందుకున్నారు. పారిశ్రామిక రంగంలో ప్రతిష్ఠాత్మకమైన అవార్డుకు భెల్ ఎంపిక కావడం పట్ల భెల్ కార్మిక నాయకులతో పాటు అధికారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

ద్విచక్ర వాహనంపై జ్యోతిర్లింగాల యాత్ర

» గోపాలపట్నం చేరిన మహారాష్ట్ర యాత్రికుడు


యాత్రికుడు వికాస్ జగన్నాథ్ షిండే

గోపాలపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకోడానికి ద్విచక్ర వాహనంపై యాత్ర చేస్తున్న మహారాష్ట్రకు చెందిన వికాస్ జగన్నాథ్ షిండే మంగళవారం గోపాలపట్నం చేరుకున్నారు. గత నెలలో యాత్రను ప్రారంభించిన షిండే ఉత్తరాది రాష్ట్రాల్లోని పది జ్యోతిర్లింగాలను దర్శించుకున్నారు. మిగిలిన శ్రీశైలం, రామేశ్వరంలోని జ్యోతిర్లింగాల దర్శనానికి వెళ్తున్న క్రమంలో గోపాలపట్నం బంకు కూడలిలో కాసేపు సేదతీరారు. ఈ సందర్భంగా స్థానికులు పలుకరించి యాత్రా విశేషాలను అడిగి తెలుసుకున్నారు. కాగా షిండే యాత్రలో భాగంగా పర్యావరణ పరిరక్షణ, బాలికా సంరక్షణపై ప్రచారం నిర్వహిస్తున్నాడు.

స్నేహితుడిపై కత్తితో దాడి

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్నేహితుల మధ్య రేగిన వివాదం కత్తిపోట్లకు దారి తీసింది. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మద్దిలపాలెం చైతన్యనగర్‌లో చిట్టుమూరి రాజు, స్నేహితులు నాని, వరుణ్‌లతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఇటీవల నాని స్నేహితుడు మహేష్ కూడా వారితో చేరాడు. ఇటీవల నాని కాకినాడ వెళ్లి వచ్చాడు. తన స్థానంలో మహేష్ ఉన్నాడు కాబట్టి అద్దె మహేష్‌ను చెల్లించమని కోరాడు. దీనిపై మహేష్, నానిల మధ్య పలుమార్లు వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి నాని గదిలో ఉండగా మహేష్ కత్తితో వచ్చి, చంపేస్తానని దాడిచేశాడు. ఛాతి, మెడపై గాయపరిచాడు. నాని నుంచి రూ.600 తీసుకుని పరారయ్యాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విస్తరిస్తున్న ప్లైవుడ్ పరిశ్రమ

(భీమునిపట్నం రూరల్, ఆంధ్రజ్యోతి)

అనేక రకాల గృహోపకరణాలు, ఆఫీసు ఫర్నిచర్ ఇతర అవసరాలకు కావాల్సిన ప్లైవుడ్ తయారీ పరిశ్రమకు భీమిలి నియోజకవర్గం చిరునామాగా మారుతోంది. ఇక్కడ ఇప్పటికే పదికి పైగా ప్లైవుడ్ పరిశ్రమలు నెలకొల్పగా, మరిన్ని ఏర్పాటు చేసేందుకు ఔత్సాహికులు ముందుకువస్తున్నారు. ఉత్తరాదికి చెందిన పారిశ్రామిక వేత్తలు ప్రారంభంలో ఈ పరిశ్రమలను ఏర్పాటుచేయగా, మెలకువలను ఔపోసన పట్టిన స్థానికులు ప్లైవుడ్ పరిశ్రమల ఏర్పాటుకు యత్నిస్తున్నారు. దీంతో పాటు పరిశ్రమలను ఏర్పాటుచేసే ప్రాంతాల్లోని వారికి ఉపాధి కూడా లభిస్తోంది. తయారైన ప్లైవుడ్ అనేక ప్రాంతాలకు ఎగుమతి చేస్తుండడంతో ఏటా సుమారు రూ.100 కోట్ల కంటే ఎక్కువగానే వ్యాపారం జరుగుతోందని అంచనా.

- » భీమిలి నియోజకవర్గంలో విరివిగా ఏర్పాటు
- » మరిన్ని నెలకొల్పేందుకు ఔత్సాహికుల యత్నాలు
- » విశాఖ పోర్టు నుంచి ముడి సరకు దిగుమతి
- » ఉత్పత్తుల ఎగుమతికి వీలుగా రవాణా మార్గాలు
- » స్థానికులకు పెద్దఎత్తున లభిస్తున్న ఉపాధి


యంత్రం నుంచి బయటకు వస్తున్న పలుచని పొరలు

నియోజకవర్గంలోని భీమిలి, బొడ్డపాలెం, లొడగలవానిపాలెం, దాకమర్రి, వెల్లంకి తదితర ప్రాంతాల్లో ప్లైవుడ్ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వీటిలో వందలాదిమంది పనిచేస్తున్నారు. అత్యధికులు బిహార్, ఒడిశా వాసులు. తయారీలో మెలకువలు తెలుసుకుంటున్న స్థానికులకు కూడా ఇటీవల ఉపాధి లభిస్తోంది. ఆయా పరిశ్రమలను నిర్వహిస్తున్నవారిలో ఉత్తరాదికి చెందిన వారు ఎక్కువ. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాలకే అధికశాతం ఎగుమతులు జరుగుతున్నాయి. ప్లైవుడ్ పరిశ్రమలకు ప్రధాన ముడిసరకును రంగూన్, బర్మా, సింగపూర్ నుంచి విశాఖ పోర్టుకు దిగుమతి చేసుకుంటున్నారు. అక్కడి నుంచి పరిశ్రమలకు లారీల్లో కలప చేరుతోంది.

తయారీ విధానం

సుమారు వంద నుంచి 300 సంవత్సరాల వయసు కలిగిన వృక్షాలను వివిధ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటారు. ఈ దుంగలను ఆరు అడుగుల ముక్కలుగా రంపంతో కోస్తారు. వీటిని ప్రత్యేక యంత్రంలో పెట్టి కత్తిరిస్తారు. యంత్రంలో గుండ్రంగా తిరుగుతున్న మాను నుంచి పలుచని పొరను తీస్తారు. ఒక మీటరు విస్తీర్ణం కలిగిన మాను ద్వారా సుమారు 200 వరకు పొరలు వస్తాయి. ముందుగా ఈ పొరలను ఆరబెడతారు. తర్వాత ఒకదానిపై మరొక దానిని ఉంచి, ప్రత్యేక గమ్‌తో అతికించి అట్టలుగా రూపొందిస్తారు. ఈ పనులకు ముందు మానులను పరిశ్రమలలో ఏర్పాటుచేసిన చిన్నచిన్న నీటి మడుగులలో నెలరోజుల పాటు నానబెడతారు. బాగా నానిన తర్వాత పెద్ద యంత్రాలలో కోత కోస్తారు. దీనివల్ల సులభంగా పల్చని పొరలు వస్తాయి. కోత కోసిన తర్వాత ఆరబెడతారు. పలుచని కాగితం వంటి ముక్కలను వరుసగా అతికిస్తారు. ఇలా తయారుచేసిన ప్లైవుడ్ ముక్కలను మూడురకాలుగా వేరు చేస్తారు. మొదటిరకం ఎక్కు వ ధర పలుకుతుండగా దీంతో తలుపులు ఇతర బలమైన వస్తువులను తయారుచేస్తారు. రెండు, మూడు రకాలకు చెందిన ప్లైవుడ్‌ను తక్కువ ధరకు విక్రయిస్తారు వాటిని స్థానిక అవసరాలకు వినియోగిస్తుంటారు.

ముందుకు వస్తున్న ఔత్సాహికులు

నియోజకవర్గంలో ప్లైవుడ్ పరిశ్రమ విస్తరిస్తోంది. ఇప్పటికే కొత్తవలస, గొరిపేట, బొడ్డపాలెం, లొడగలవానిపాలెం, వెల్లంకి తదితర ప్రాంతాల్లో భారీ పరిశ్రమలను ఏర్పాటు చేశారు. వీటిలో రెం డింటిని ఎన్ఆర్ఐలు నిర్వహిస్తున్నారు. ఈ పరిశ్ర మల్లో ప్లైవుడ్ తయారీకోసం స్థానికంగా వందలాదిమంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన పారిశ్రామికవేత్తలు భీమిలి, ఆనందపురం మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తున్నారు. విశాఖ పోర్టుకు షిప్పులద్వారా దిగుమతి అయ్యే దుంగ లను పరిశ్రమల వరకు సులభంగా రవాణా చేసే వీలుండడం, ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు జాతీయ రహదారి, విశాఖ, విజయనగరం లో రైల్వేస్టేషన్లు అందుబాటులో ఉండడం పరిశ్రమ విస్తరణకు కారణాలుగా పేర్కొంటున్నారు. కాగా గంభీరం పారిశ్రామిక పార్కులో ఇటీవల రెండు ప్లైవుడ్ పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేశారు. భీమిలి మండలంలో దాకమర్రి, మహారాజుపేట అమనాం, తగరపువలస సమీపంలో కొంతమంది ఈ పరిశ్రమల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు.


యంత్రాల మధ్యలో దుంగలను ఉంచుతున్న కార్మికులు

అనుబంధ పరిశ్రమలు అవసరం

ప్లైవుడ్ పరిశ్రమలకు అనుబంధంగా చిన్న పరిశ్ర మల ఏర్పాటుకు అవకాశం ఉంది. కానీ ఔత్సాహికు లు ముందుకురావడం లేదు. పెందుర్తి, అగనంపూడి ప్రాంతాలలో కొన్ని అనుబంధ పరిశ్రమలున్నాయి. ఇవి ఏర్పాటైతే మరింతమంది స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయంటున్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండండి: కలెక్టర్


శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల పీవోలు, ఏపీవోలు, సెక్టోరల్ అధికారులకు నిర్వహించిన తొలివిడత శిక్షణలో పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. విధుల్లో అలసత్వం వద్దని హెచ్చరించారు. మారుతున్న నిబంధనలను తెలుసుకుని, కొత్త ఆదేశాలు పాటిస్తూ, విధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను అర్థం చేసుకుని, ఆచరణలో చేసి చూపాలని, సొంత నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. బ్యాలెట్ పత్రాలతో జరిగే ఎన్నికలకు, ఈవీఎంలతో నిర్వహించే పోలింగ్‌కు మధ్య తేడా ఉంటుం దన్నారు. ఎన్నికల సామగ్రి తీసుకున్నప్పటి నుంచి, ఓటింగ్ పూర్తిచేసి తిరిగి అప్పగించే వరకు నిబంధనలపై పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. పొరపాట్లకు తావు లేకుండా పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయాలని సూచించారు. పోలింగ్ ముందు, పోలింగ్ రోజు, తరువాత చేయవలసిన విధులను డీఆర్‌వో భవానీశంకర్, నోడల్ అధికారి సుధాసాగర్‌లు పీపీటీ ద్వారా వివరించారు. ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెందుర్తిలో భారీ చోరీ

» 80 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణ


బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ సూరిబాబు

పెందుర్తి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి 80 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఈ సంఘటన పెందుర్తిసమీపం రాజయ్యపేట వద్ద జరిగింది. క్రైమ్ ఎస్ఐ సూరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజయ్యపేట శివారులో గల ఓ ఇంట్లో కనస్ట్రక్షన్ వ్యాపారి ఆకెళ్ల గౌరీశంకర్ నివసిస్తున్నారు. రెండు రోజుల క్రితం కుటుంబసభ్యులతో కలసి బంధువుల గృహప్రవేశానికి గాజువాక వెళ్లారు. తిరిగి మంగళవారం రాత్రి ఇంటికి చేరుకున్న వారు ప్రధాన ద్వారం తలుపులు తీసుకుని లోనికి ప్రవేశించగా ఇల్లంతా చిందర వందరగా ఉంది. ఆందోళనతో బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి , అందులో భద్రపరిచిన 80 గ్రాముల బంగారం మాయమైనట్టు గుర్తించారు. కిటికి గ్రిల్స్ విరగొట్టి ఉండడంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్రైమ్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సూరిబాబు ఇంటిని సందర్శించి క్లూస్ టీంను రప్పించి ఆధారాలు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

sf | సుందరం హోమ్

సమోదిత కార్యాలయం : నం.21, పటుల్లాస్‌రోడ్, చెన్నై - 600002
కార్పొరేట్ కార్యాలయము : సుందరం టవర్స్, నం.46, వైట్స్ రోడ్, చెన్నై - 600014. ఫోన్: 044-2851 5267
శాఖ కార్యాలయం: జెఎమ్-3, మొదటి అంతస్తు, ఎమ్.జి.రోడ్, (చంద్రమౌళిపురం పోస్టాఫీస్ ఎదురుగా), విజయవాడ-520 010

అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 క్రింద మరియు సెక్షన్ 13(2)తో చదువబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని **సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** అధీకృత అధికారి సదరు నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన మొత్తంను తిరిగి చెల్లించవల్సిందిగా రుణగ్రహీత మరియు సహ రుణగ్రహీతలను కోరుతూ తేదీ **29.11.2024** గల డిమాండ్ నోటీసు జారీ చేశారు.

సదరు చట్టబద్ధకాలంలోగా మొత్తమును తిరిగి చెల్లించుటలో రుణగ్రహీతలు విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూలు 8కి అనుగుణంగా సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను ఉపయోగిస్తూ దిగువ ఇందులో వివరించిన ఆస్తిని దిగువ అధీకృత అధికారి స్వాధీనం చేసుకున్నారు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8 & 9 క్రింద **"ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా మరియు అక్కడ ఏమున్నదో అదే"** మరియు ఎటువంటి అవలంబన లేని ప్రాతిపదికన **29.03.2025న 15.30 గం.వరకు** ప్రజల నుండి సీల్డు బిడ్లు కోరడం ద్వారా దిగువ పట్టికలో మరియు పూర్తిగా వివరించిన ఆస్తిని విక్రయించుటకు నిర్ణయించడమైనదని ప్రజలకు సమాచారం ఇవ్వడమైనది. వేలం అమ్మకంలో పాల్గొనగోరు వారు **29.03.2025న 15.30 గం. వరకు** లేదా ఆలోగా దిగువ సంతకందారుకు **A/c శ్రీ వెంకటరావ్ నాగమోతు** అస్తుల విక్రయం కొరకు ఆఫర్ చేయబడిన విధంగా అస్సెట్స్ విక్రయ ఖాతా కొరకు సీల్డు కవర్‌లో అధీకృత అధికారి, సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నం.47-10-23/4, టిఎస్ నం.672 ఇస్నార్ ఖజానా టవర్స్, ఫ్లాట్ నం.213-బి, టిపి నం.91/50 మొదటి అంతస్తు, విశాఖపట్నం కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లేఅవుట్, ద్వారకా నగర్, 2వ లేన్, అల్లిపురం వార్డ్ విశాఖపట్నం-530016 చిరునామాకు కెవైసి డాక్యుమెంట్లతో సీల్డు కవర్‌లో RPAD/ స్వయంగా మాత్రమే వారి బిడ్లను పంపవలెను. రుణ ఖాతా నం. **VJD20240173 శ్రీ వెంకటరావ్ నాగమోతు** కొరకు బయానా రిమార్కులతో ఖాతా పేరు సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ అకౌంట్ నెం: **VJD20240173**, బ్యాంక్ పేరు : HDFC బ్యాంక్ లిమిటెడ్, ఐటిసి సెంటర్ - అన్నాసలై, చెన్నై-600002, ఖాతా - కరెంట్ ఖాతా. IFSC CODE - HDFC0000004 కు RTGS చెల్లింపు యొక్క వివరాలతో లేదా మొత్తం బయానా కొరకు సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరున DD ద్వారా బిడ్లు స్వీకరించబడతాయి. **29.03.2025న 15.30 గం.వరకు** తరువాత స్వీకరించబడిన టెండర్లు తిరస్కరించబడును. మరియు **29.03.2025న 15.30 గం.వరకు** RPAD/ స్వయంగా స్వీకరించబడిన సీల్డు బిడ్లు దిగువ తెలిపిన ప్రదేశం వద్ద **29.03.2025న 16.00 గం.వరకు** తెరువబడును. గెలుపొందిన బిడ్డరు సమాచారం స్వీకరించిన తేదీ నుండి 15 రోజులలోగా మిగిలిన మొత్తాన్ని చెల్లించవలెను. పైన తెలిపిన విధంగా మిగిలిన మొత్తం చెల్లించిన తరువాత మాత్రమే అమ్మకం పూర్తి చేయబడును.

రుణగ్రహీత & సహరుణగ్రహీత పేరు మరియు చిరునామా	సెక్యూర్డ్ రుణం (రూ.)	ఆస్తికి నిర్ణయించిన రిజర్వు ధర	టైటిల్ పరిశీలన ప్రదేశం
శ్రీ వెంకట రావ్ నాగమోతు (రుణగ్రహీత) డోర్ నం.11-505 2/2, శ్రీకరనిలయం, ప్రశాంతి నగర్, అమరావతి రోడ్, గోరంట్ల, గుంటూరు-522034 మరియు వెంకట్ ఆయిల్స్ ఏజెన్సీ & కో., నం.8-69, పేరేచర్ల గ్రామం, మేడికొండూరు మండలం, గుంటూరు-522005 మరియు ఫ్లాట్ నం.133, ఓక్ వ్యాలీ ఫేజ్-1, ఎల్‌పి నం.21/2014, ఎస్.నం.135/బి, 136/బి మరియు 138/బి, సింగనబండ గ్రామం, భీమునిపట్నం, విశాఖపట్నం-531162. శ్రీమతి ధనమ్మ నాగమోతు (సహ-రుణగ్రహీత), డోర్ నం.11-505 2/2, శ్రీకరనిలయం, ప్రశాంతి నగర్, అమరావతి రోడ్, గోరంట్ల, గుంటూరు-522034 మరియు భాష్యం ఎడ్యుకేషనల్ సొసైటీ, నం.10-3-30, ఉమెన్స్ కాలేజీ ఎదురుగా, 3వ లేన్, సాంబశివపేట, నాజ్ సెంటర్, గుంటూరు-522001.	19.02.2025 నాటికి కలుపుకొని **రూ.81,52,780/-** (రూపాయలు ఎనభై ఒక్క లక్షల యాభై రెండు వేల ఏడు వందల ఎనభై మాత్రమే) అప్పటి వరకు ఉన్నటువంటి ఇతర చార్జీలు, వడ్డీరాలు మరియు తదుపరి వడ్డీతో.	**రూ.95,50,000/-** (రూపాయలు తొంభై ఐదు లక్షల యాభై వేలు మాత్రమే) / బయానా: బిడ్ మొత్తంలో 25%	**సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్,** డోర్ నం.47-10-23/4, టి ఎస్ నం.672, ఇస్నార్ ఖజానా టవర్స్, ఫ్లాట్ నం.213-బి, టిపి నం.91/50 మొదటి అంతస్తు, విశాఖపట్నం కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లేఅవుట్, 2వ లేన్ ద్వారకానగర్, అల్లిపురం వార్డు, విశాఖపట్నం-530016. / బిడ్ తెరుచు తేది & సమయం: **29.03.2025న 16.00 గం.లకు**

సెక్యూర్డ్ ఆస్తి వివరణ: ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం మండలం, సింగనబండ గ్రామం వద్ద గల ఎల్‌పి నం. 21/2014, డి.నం. 135/బి, 136/బి మరియు 138/బి లోని 509.25 చ.గజాలు విస్తీర్ణం కలిగిన ఫ్లాట్ నం.133, ఓక్ వ్యాలీ ఫేజ్-1 లేఅవుట్‌లోని ఆస్తి యావత్తు. సరిహద్దులు: తూర్పు: 40 అడుగుల వెడల్పు రోడ్ సరిహద్దు. దక్షిణం: ఫేజ్-1లో ఫ్లాట్ నం.134, పశ్చిమం: ఫేజ్-1లో ఫ్లాట్ నం.132, ఉత్తరం: ఫేజ్-1లో ఫ్లాట్ నం.132, టైటిల్ డీడ్ నం.2345/2023, ఎస్ఆర్‌వో, గుంటూరులో మరింత పూర్తిగా మరియు స్పష్టంగా వివరించబడినది.

గమనిక: కాగోరు కొనుగోలుదారులు వేలంలో పాల్గొనుటకు టైటిల్‌ను పరిశీలించుకొని మరియు సంతృప్తి చెందవలసినదిగా కోరబడుచున్నారు. టైటిల్ డీడ్‌కులేదా ఆస్తి స్వభావానికి సంబంధించి ఏదేని వివాదం ఉత్పన్నం అయినచో అమ్మకం నిర్ధారణ తరువాత రీఫండ్ ఇవ్వబడదు.

సవివర ఆస్తి అమ్మకం నియమ మరియు నిబంధనలకు శ్రీ వెంకట రావ్ నాగమోతు, లోన్ అకౌంట్ నం. VJD20240173 www.sundaramhome.in/uploads/files/sale_notice/vjd20240173.pdf ను దర్శించండి.

సంప్రదించవలసిన వ్యక్తి : శ్రీ గిరిరాజ్ - 9553441464

తేది: 19.02.2025 సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, అధీకృత అధికారి తరఫున.

జాతీయ కబడ్డీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక


జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5 నుంచి 18 వరకు నిర్వహించిన రాష్ట్ర పురుషుల సీనియర్ కబడ్డీ శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. పెదవాల్తేరు గాంధీ బొమ్మసెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామకృష్ణ చౌదరి, లాలం రమేష్, రాష్ట్ర అధ్యక్షుడు జి.వెంకరెడ్డి, కార్యదర్శి వై.శ్రీకాంత్, వీవీ రమణ, సీహెచ్ పద్మరాజు పాల్గొని ఎంపికైన క్రీడాకారులకు టీ షర్ట్, ట్రాక్ సూట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి జె.ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ 71వ సీనియర్ జాతీయస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొనేందుకు 12 మంది క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. కోచ్‌గా వైవీ శ్రీనివాస్, మేనేజర్‌గా వి చైతన్య వ్యవహరిస్తారన్నారు. ఈ పోటీలు ఫిబ్రవరి 20 నుంచి 23వ వరకు ఒడిశాలోని కటక్ జిల్లాలో జరుగుతాయన్నారు.

ఆధునిక సాంకేతికతతో తపాలా సేవలు



క్లస్టర్‌మీట్‌లో పాల్గొన్న అధికారులు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికతతో తపాలా సేవలను విస్తరించ నున్నట్టు సీనియర్ సూపరింటెండెంట్ గజేంద్రకుమార్ మీనా తెలిపారు. మంగళవారం బీచ్ రోడ్డులోని అంబికా సీ గ్రీన్‌లో నిర్వహించిన బిజినెస్ డెవలప్‌మెంట్ కస్టమర్ మీట్ 2025లో ఆయన వినియోగదారులతో మాట్లాడారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వితేజ్ మాట్లాడుతూ తపాలా సేవలను, చివరి మైలు కనెక్టివిటీని ప్రశంసించారు. సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ డివిజన్ కోమల్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ కేవీడీ సాగర్ ప్రసంగించారు. స్పీడ్ పోస్టు, పార్సిల్స్, బీఎస్‌పీఎల్, డాక్‌ఘర్, జీవిత బీమా, ఆధార్ సేవలను వివరించారు.

హేచరీ నిర్మాణంలో దిద్దుబాట్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


వెదురు కర్రలతో దగ్గర దగ్గరగా నిర్మించిన హేచరీ

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బీచ్‌రోడ్డు కుసురుర మ్యూజియానికి ఆనుకుని ఇసుకతెన్నెల్లో సముద్ర తాబేళ్ల గుడ్ల పరిరక్షణకు అటవీ శాఖ నిర్మించిన హేచరీ లోపాలను సరిచేసింది. కుక్కలు, ఇతర జంతువులు లోపలకు వెళ్లకుండా వెదురు కర్రలతో దగ్గర దగ్గరగా నిర్మించారు. ఈ నేపథ్యంలో 'పనితీరు మార్చుకోని అటవీ శాఖ అధికారులు' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అటవీ అధికారులు స్పందించారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించి కుక్కలు, ఇతర జంతువులు వెళ్లకుండా వెదురు కర్రలతో బిగించామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పి.వి.శాస్త్రి తెలియజేశారు.

క్రైం... crime news

పదోతరగతి విద్యార్థిని ఆత్మహత్య


షాసా (ఫైల్ ఫొటో)

సీతంపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మేడపైనుంచి దూకి పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన అక్కయ్యపాలెం ఎన్‌జీఓస్ కాలనీలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఎన్‌జీఓస్ కాలనీలో విష్ణు విల్లా అపార్ట్‌మెంట్ మొదటి అంతస్థులో సిరికిపల్లి పద్మజ, వివేన్ పాల్ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరి కుమార్తె సిరికిపల్లి షాసా సీతమ్మధారలోని ప్రెసిడెన్సీ స్కూల్‌లో పదోతరగతి చదువుతోంది. మంగళవారం మధ్యాహ్నం కడుపు నొప్పి వస్తోందని తల్లికి తెలిపింది. భోజనం చేయాలని తల్లి సూచించగా, తిననంటూ తల్లి పక్కనే నిద్రకు ఉపక్రమించింది. కొద్దిసేపటి తర్వాత వాష్‌రూమ్‌కి వెళ్లి వస్తానని చెప్పింది. ఇంతలో పెద్ద శబ్దం రావడంతో ఏం జరిగిందో అనుకుంటూ షాసా తల్లి వచ్చి చూసేసరికి కిందన రక్తపు మడుగులో షాసా పడి ఉది. హుటాహుటిన కిందికి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. దీంతో నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో తల్లి పద్మజ ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జి సీఐ దాలిబాబు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. బాలిక మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మనోహర్ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై షీలానగర్ జంక్షన్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వెంకయ్యపాలేనికి చెందిన మైలపల్లి మనోహర్ (23) నగరంలోని మెరినో ఇండస్ట్రీస్ లిమిటెడ్ సేల్స్ విభాగంలో పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం విధులు ముగించుకుని పల్సర్ బైక్‌పై రాంబిల్లిలోని తన ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో షీలానగర్ జంక్షన్ దాటిన తరువాత వెనుక నుంచి వస్తున్న కంటైనర్ లారీ మనోహర్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన మనోహర్ తలకు తీవ్రగాయమయింది. అతడు హెల్మెట్ ధరించి ఉన్నప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండాపోయింది. కొన ఊపిరితో ఉన్న మనోహర్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక దాడి కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు

విశాఖలీగల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.3 లక్షలు జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది మంగళవారం తీర్పుచెప్పారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీవీఆర్ మూర్తి అందించిన వివరాలిలా ఉన్నాయి. సబ్బవరం మండలం నాయనమ్మపాలెం గ్రామానికి చెందిన ఎర్ర నవీన్ బాధితురాలు స్థానిక పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారు. అక్కడే వారికి పరిచయం ఏర్పడింది. ఆ తరువాత నవీన్ ఐటీఐలో, బాధితురాలు ఇంటర్‌పూర్తి చేసి డిగ్రీలో చేరారు. ఆ తరువాత కూడా నవీన్ అతని స్నేహితులు బాధితురాలిని తరచూ డిగ్రీ కళాశాలలో కలుసుకునేవారు. ఈ నేపథ్యంలో నవీన్ మాయమాటలతో బాధితురాలిని పలుమార్లు శారీరకంగా కలిశాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. బాధితురాలు గర్భవతి కావడంతో పెళ్లి చేసుకోవాలని కోరింది. అందుకు నవీన్ తిరస్కరించాడు. ఈ నేపథ్యంలో ఆమె పోలీసులను ఆశ్రయించింది. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం బాలిక గర్భవతి కావడానికి నవీన్ కారణమని నివేదిక వచ్చింది. దీంతో అప్పటి దిశ పోలీస్‌స్టేషన్ అధికారి ప్రేమ్‌కాజల్ కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో ముద్దాయికి 20 ఏళ్ల జైలు, రూ.3లక్షలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కాగా మరో రూ.7 లక్షలను బాధితురాలికి ప్రభుత్వం పరిహారంగా అందించాలని తీర్పులో పేర్కొన్నారు.

వేర్వేరుగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిపై కేసులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకుని అతని వద్ద నుంచి గంజాయి సంచులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని రైల్వే పోలీసులు తెలిపారు. మంగళవారం ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ, జీఆర్పీ ఎస్ఐ రామారావు తనిఖీ చేస్తుండగా కేరళకు చెందిన ఎస్ఆర్.అమల్ గంజాయితో దొరికాడని తెలిపారు. అతడి నుంచి 8.5 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచామన్నారు. మరో కేసులో ఝార్ఖండ్‌కు చెందిన ఎండీఅర్షాద్ పాడువాపై కేసు నమో దు చేశామన్నారు. అతడు రైల్లో గంజాయి రవాణా చేస్తుండగా జీఆర్పీ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.శాంతారామ్, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ జె.టి.నాయుడు పట్టుకుని రూ.15 వేలు విలువ చేసే మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

Change of Name

I , SUNKARA SAI SAILESWARI (New Name) C/O PAVAN KUMAR BATTULA Previously called SUNKARA SAILESWARI (Old Name) R/O 65-3-470/A, Ex-servicemen Colony, Opp Cormandal Gate, Sriharipuram, Vtc; Visakhapatnam, Malkapuram, Andhra Pradesh 530011, Now changed my name from SUNKARA SAILESWARI (Old Name) to SUNKARA SAI SAILESWARI (New Name). Hence forth I will be called as SUNKARA SAI SAILESWARI (New Name) for all purpose.

AJC CLASSIFIEDS

FLAT FOR SALE
READY TO MOVE IN
Visit flat, Pay, Register on your name, TAKE FLAT KEYS & OCCUPY
10 FLATS, 2 BHK
@ Phase-2, VUDA layout, KURMANNAPALEM, VIZAG
M/s Utkarsaa enterprises Builders & Developers
8885516379

CHANGE OF NAME

I, PONNADA DEVI (New Name) W/o. PONNADA RAMARAO, previously called PONNADA DEVI RAO(Old Name) Resident of D.No: 4-25, Lalam Koduru, Rambilli Mandal, Visakhapatnam Dist., Andhra Pradesh-531011. I have changed my name from PONNADA DEVI RAO to PONNADA DEVI. Hence forth I being called as PONNADA DEVI (New Name) for all purpose.

CHANGE OF NAME

★ I, THULASI SATHYAVANI (Old Name) W/o. Tulasi Venkata Lakshmi Narasimha Rao, R/o. F.No.303, Sai Suryas, Gallavanipalem, Aganampudi, Duvvada, VSP. Change my name from THULASI SATHYAVANI (Old Name) to TULASI SATYAVANI (New Name). Henceforth I am being called as TULASI SATYAVANI (New Name) for all purposes.
AJV_231089

CHANGE OF NAME

★ I, ESWARA RAO GINNA (Old Name) S/o. JISRAYYA REDDY, R/at 27-11-122/1, Sundarayya Colony, Srinagar, Gajuwaka, Visakhapatnam. Change my name from ESWARA RAO GINNA (Old Name) to G.I. REDDY, (New Name). Henceforth I am being called as G.I. REDDY (New Name) S/o. JISRAYYA REDDY, for all purposes.
AJV_ 231093

CHANGE OF NAME

★ We, TAMMINANA SHANMUKHA KUMAR & TAMMINANA MALATHI Parents of TAMMINANA TEJASWANI (Old Name) R/o. SLVN Paradise-3, G-10, Lakshmi Narasimha Colony, Penduthi, P.O., Sujatha Nagar, Visakhapatnam. Changed my daughter's name from TAMMINANA TEJASWANI (Old Name) to TAMMINANA TEJASWINI (New Name). Henceforth she will be called as TAMMINANA TEJASWINI (New Name) for all purposes.
AJV_231090

CHANGE OF NAME

★ I, DWARAMPUDI SWARAJ LAXMI (Old Name) W/o. Dwarampudi Narayana Reddy, R/o. 9-7-11/17, Shivajipalem, L.B.Colony, Visakhapatnam. Change my name from DWARAMPUDI SWARAJ LAXMI (Old Name) to DWARAMPUDI SWARAJYA LAKSHMI (New Name). Henceforth I am being called as DWARAMPUDI SWARAJYA LAKSHMI (New Name), for all purposes.
AJV_231091

CHANGE OF NAME

★ I, THULASI VENKATA LAKSHMI NARASIMHA RAO (Old Name) S/o. Tulasi Krishna Murty, R/o. F.No.303, Sai Suryas, Gallavanipalem, Aganampudi, Duvvada, Visakhapatnam. Change my name from THULASI VENKATA LAKSHMI NARASIMHA RAO (Old Name) to TULASI VENKATA LAKSHMI NARASIMHA RAO (New Name). Henceforth I am being called as TULASI VENKATA LAKSHMI NARASIMHA RAO (New Name) for all purposes.
AJV_231092

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

For Advertisement Contact :
9963231176
9966165093